


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 13 ఏప్రిల్ 2022 సంపుటి: 03 సంచిక: 209 పేజీలు: 4 వెల: రూ 3-00


## వైద్య, ఆరోగ్య శాఖలపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి.వైద్య, ఆరోగ్యశాఖపై క్యాంప్ కార్యాలయంలో సీఎం వైయస్.జగన్ మోహన్ రెడ్డి మంగలశారం నాడు సమీక్ష నిర్వహించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆసుపత్రులలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సమాచార కియోస్క్ మోడల్ను పరిశీలించారు. ఆరోగ్యశ్రీలో మరింత సులువుగా వైద్య సేవలు పొందడం ఇలా అనే విధంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకున్న రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాం. వాటిద్వారా ప్రజలకు మంచి జీవన ప్రమాణాలు అందించడంపై ప్రత్యేక దృష్టిపెట్టామని అన్నారు. ఆరోగ్య శ్రీ కింద చికిత్సల సంఖ్యను గణనీయంగా పెంచాం. 16 టీచింగ్ ఆస్పత్రులను తీసుకు వస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీఎంపీ, డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలున్న మందులు ఇస్తున్నాం. భారీ మార్పులను ఆశించి, దానికి అనుగుణంగా లక్ష్యాలు పెట్టుకున్నాం. విద్య, వైద్యం, వ్యవసాయ, గృహనిర్మాణం తదితర కీలక రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు చరిత్రాత్మకం. వైద్య రంగం విషయానికొస్తే.. చరిత్రలో ఎప్పుడూలేని విధంగా వేల సంఖ్యలో పోస్టులను భర్తీచేశామని అన్నారు. వేల కోట్లను ఈ రంగంపై ఖర్చు చేస్తున్నాం. విలేజ్ / వార్డు క్లినిక్స్ దగ్గరనుంచి టీచింగ్ ఆస్పత్రుల వరకూ కూడా నాడు ? నేడు కింద అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఆరోగ్య శ్రీ కింద ఎలాంటి పెండింగ్ బిల్లులు లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాం. ఆరోగ్య ఆసరా కింద రోగులకు.. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటి వెళ్లే సమయంలో డబ్బులు ఇస్తున్నాం. అందుకే విద్య, వైద్య సహా కీలక రంగాలను అత్యంత సీరియస్గా తీసుకుంటున్నాం. అనుభవం,



సమర్థత ఉన్న అధికారులను ఆయా శాఖలకు అప్పగించాం. వైద్యం, ఆరోగ్యం అంశాలపై లక్ష్యాలను ఒక ముఖ్యమంత్రిగా నేను నిర్దేశిస్తాను. తరువాత , ఆ లక్ష్యాన్ని అందుకునేందుకు యజ్ఞంలా అధికారులు పనిచేయాలని అయన సూచించారు. ఈ సమీక్షా సమావేశానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, సీఎస్ సమీర్ శర్మ, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి (కోవిడ్ మేనేజిమెంట్ అండ్ వ్యాక్సినేషన్) ముద్దాడ రవిచంద్ర, ఆరోగ్యశ్రీ సీఈఓ వి వినయ్ చంద్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి మురళీధర్రెడ్డి ఇతర ఉన్నతాధికారులు హాజరు అయ్యారు.

## ప్రపంచానికి ఆహారం అందించేందుకు భారత్ సిద్ధం : మోదీ

న్యూఢిల్లీ : ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) అనుమతి మంజూరు చేస్తే, ప్రపంచానికి ఆహారాన్ని సరఫరా చేయడానికి భారత దేశం సిద్ధంగా ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్తో వర్చువల్ సమావేశంలో ఈ విషయాన్ని తాను చెప్పానని మంగళవారం మోదీ తెలిపారు. గుజరాత్లోని అడలజ్లో శ్రీ అన్నపూర్ణ ధామ్ ట్రస్ట్ విద్య, హాస్టల్ సముదాయాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉక్రెయిన్లో యుద్ధం వల్ల ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో ఆహార నిల్వలు క్షీణిస్తున్నాయని చెప్పారు. నేడు ప్రపంచం అనిశ్చిత పరిస్థితిని ఎదుర్కొంటోందని, తమకు కావలసినవి ఎవరికీ అందుబాటులో ఉండటం లేదని అన్నారు. అన్ని తలుపులు మూసి ఉండటంతో



పెట్రోలు, చమురు, ఎరువులను సంపాదించడం కష్టంగా మారిందన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి ఒక్కరూ తమ వద్దనున్న నిల్వలను సురక్షితంగా కాపాడుకోవాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రపంచం ఇప్పుడు కొత్త సమస్యను ఎదుర్కొంటోందని, ప్రపంచంలో ఆహార నిల్వలు నిండుకుంటున్నాయని చెప్పారు. తాను సోమవారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్తో మాట్లాడినపుడు ఆయన కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారని తెలిపారు. డబ్ల్యూటీఓ అనుమతి ఇస్తే భారత దేశం రేపటి నుంచే ఆహార సరఫరాకు సిద్ధంగా ఉందని తాను చెప్పానని తెలిపారు. మన ప్రజలకు సరిపడినంత ఆహారం మన వద్ద ఉందని, అయితే మన రైతులు ప్రపంచానికి భోజనం పెట్టడానికి ఏర్పాట్లు చేసినట్లు కనిపిస్తోందని చెప్పారు. అయితే మనం ప్రపంచ చట్టాలకు అనుగుణంగా పని చేయవలసి ఉంటుందన్నారు. డబ్ల్యూటీఓ ఎప్పుడు అనుమతి ఇస్తుందో, మనం ప్రపంచానికి ఆహారాన్ని ఎప్పుడు సరఫరా చేయగలమో తాను చెప్పలేనన్నారు.

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చెల్లుబోయిన వేణు

అమరావతి: బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రిగా రామచంద్రాపురం ఎమ్మెల్యే చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయం రెండో బ్లాక్లోని తన ఛాంబర్లో ప్రత్యేక పూజల అనంతరం చెల్లుబోయిన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ ముదనూరి ప్రసాదరాజు, ఐ అండ్ పీఆర్ శాఖాధికారులు మంత్రికి అభినందనలు తెలిపారు.

నేపథ్యం

పేరు: చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ

నియోజకవర్గం: రామచంద్రాపురం

స్వస్థలం: అడవిపాలెం



తల్లిదండ్రులు: సుభద్రమ్మ, వెంకన్న (లేట్)

పుట్టినతేదీ: డిసెంబర్ 23, 1962

విద్యార్హతలు: బీఏ

సతీమణి: వరలక్ష్మి

సంతానం: కుమారులు నరేన్, ఉమాశంకర్

జిల్లా: కోనసీమ

రాజకీయ నేపథ్యం: 2001లో రాజోలు జెడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. 2006లో తూర్పు గోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్గా ఎన్నికయ్యారు. 2008?12లో తూర్పుగోదావరి డీసీసీ అధ్యక్షుడిగా, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. 2013లో వైఎస్సార్సీపీ కాకినాడ రూరల్ కో ఆర్డినేటర్గా నియమితులయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. 2019లో రామచంద్రపురం నియోజకవర్గం నుంచి వైఎస్సార్సీపీ అభ్యర్థిగా గెలుపొందారు. వైఎస్ జగన్మోహన్రెడ్డి మంత్రివర్గంలో 2020 జూలై 24న మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో రెండోసారి అవకాశం దక్కించుకున్నారు.

## ఏ బాధ్యత అప్పగించినా పూర్తిస్థాయిలో పనిచేస్తా: పిన్నెల్లి

అమరావతి: వైఎస్సార్సీపీ పార్టీ అంటే తమ పార్టీ అని, సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి వెంట తాను మొదటి నుంచీ నడిచిన వ్యక్తినని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన మంగళవారం సీఎం వైఎస్జగన్తో భేటీ అయిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కేబినెట్లో సామాజిక సమీకరణలో భాగంగా సీఎం జగన్.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు భాగస్వామ్యం కల్పించారని తెలిపారు. అందువల్ల సీనియర్లకు అవకాశం రాలేదని చెప్పారు.తమ టార్గెట్ 2024 ఎన్నికలు అని, దానికోసం ఏ బాధ్యత ఇచ్చినా పూర్తిస్థాయిలో పని చేస్తానని ఎమ్మెల్యే పిన్నెల్లి తెలిపారు. పార్టీ కోసం దేనికైనా సిద్ధమని, తనకు ఏ హామీ ఇవ్వలేదని తెలిపారు. హామీ ఇవ్వాల్సిన అవసరం కూడా లేదని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ తనకు బీ ఫామ్ ఇవ్వబట్టే ఎమ్మెల్యేగా గెలిచానని గుర్తుచేశారు. ఆయన ఏమి చేసినా పార్టీ మంచి కోసమే చేస్తారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఎవరికీ



అన్యాయం చేయరని, అందరూ పార్టీ కోసం పని చేయాల్సిందేని చెప్పారు.అంతకు ముందు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు. ఈ క్రమంలో మంత్రి పదవి రాలేదని తనకు ఎలాంటి అసంతృప్తి లేదని తెలిపారు. పార్టీనే మాది.. అసంతృప్తి ఎక్కడుంటుందని వ్యాఖ్యానించారు.

## కొండరెడ్లను కలవడం ఆనందంగా ఉంది: గవర్నర్ తమిళి సై

భద్రాద్రి కొత్తగూడెం: కొండరెడ్లను వాళ్ల గ్రామంలో కలవడం ఎంతో ఆనందంగా ఉందని గవర్నర్ తమిళి సై అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెంలో గవర్నర్ పర్యటించారు. ఆదివాసీలతో కలసి గవర్నర్ తమిళి సై భోజనం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ..“ఈ రోజు కోసం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నా. గిరిజన ఆహారంలో పోషకాహార లోపాలు ఉన్నాయి.ఆదిమ గిరిజన తెగలల్లో పౌష్టికాహారం లోప నివారణ మరియు సమగ్ర అభివృద్ధి పథకం ఏర్పాటు చేశాం. ఈ పైలట్ ప్రాజెక్ట్ మరింత ముందుకు సాగాలి. దమ్మపేట మండలంలోని పూసుకుంట, అశ్వారావుపేట మండలం లోని గోగులాపూడి గ్రామాలను దత్తత తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది, వారి జీవనాలు ఇంకా ఎదగాలి. అందరినీ కలవటం చాలా ఆనందంగా ఉంది” అని గవర్నర్ తమిళి సై తెలిపారు.



## క్యూలైన్లలో భక్తులు అవస్థలు పడుతుంటే... తితిదే ఏం చేస్తోంది

చంద్రబాబు నాయుడు



తిరుమల తిరుపతిలో భక్తుల కష్టాలపై టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, శ్రీ నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. క్యూలైన్లలో గంటల తరబడి అవస్థలు పడుతుంటే తితిదే ఏం చేస్తోందని ప్రశ్నించారు. కొండపైకి వెళ్లేందుకూ ఆంక్షలు విధించడమంటే.. భక్తుల మనోభావాలు దెబ్బతీయడమేనని మండిపడ్డారు. తితిదే నిర్ణయాలు భక్తులకు శ్రీవారిని దూరం చేసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తిరుమలలో సర్వదర్శనం టోకెన్ల కోసం భక్తులు పడుతున్న కష్టాలపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది భక్తులు గంటల తరబడి పసిబిడ్డలతో మండుటెండలో అవస్థలు పడుతుంటే.. తితిదే ఏం చేస్తోందని ప్రశ్నించారు. భక్తులకు తాగునీరు, క్యూలైన్లలో నీడ ఉండేలా చూడలేరా అని నిలదీశారు. తితిదే నిర్ణయాలతో శ్రీవారిని భక్తులకు దూరం చేసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్శనాలు, వసతి వంటి అంశాల్లో మొదటి నుంచి ఇదే తరహా అలసత్వం తితిదేలో కనిపిస్తోందని ఆరోపించారు. తిరుమల లాంటి ఆధ్యాత్మిక కేంద్రాన్ని ఆదాయ వనరు కోణంలోనే తితిదే చూస్తోందని విమర్శించారు. కొండపైకి వెళ్లడానికి కూడా ఆంక్షలు విధించడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని దుయ్యబట్టారు. భక్తులకు తితిదే క్షమాపణలు చెప్పి వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

## కేంద్రంపై కేసీఆర్ విషప్రచారం: కిషన్‌రెడ్డి

ఢిల్లీ: కేసీఆర్ కుటుంబం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి కిషన్రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..“రైతుల కోసం కాదు..రాజకీయం కోసమే కేసీఆర్ ధర్నాలు... ముద్దుల కొడుకు కేటీఆర్ కోసమే కేసీఆర్ దీక్షలు.కేసీఆర్ కుటుంబానికి ఒక విధానం, దేశానికి ఒక విధానం ఉండదు.తెలంగాణ రైతుల కోసం కేంద్రం రూ.3400 కోట్లు ఖర్చు చేసింది.ఎరువులపై ఒక్క రూపాయి కూడా పెరగదు. కేంద్రంపై సీఎం కేసీఆర్ విషప్రచారం చేస్తున్నారు.వడ్ల విషయంలో లేని సమస్యను ఉన్నట్టుగా ప్రచారం చేస్తున్నారు.బాయిల్డ్ రైస్ ఇవ్వబోమని రాసిచ్చిన మాట నిజంకాదా?.చివరి గింజ వరకు కొంటామని ఇప్పటికే కేంద్రం చెప్పింది.ఉచితంగా ఎరువులిస్తామన్న కేసీఆర్.. ఇప్పటికీ ఇవ్వలేదు” అని కిషన్రెడ్డి తెలిపారు.



## టీడీపీకి బీసీలు ఎప్పుడో దూరమైపోయారు: స్పీకర్ తమ్మినేని

అమరావతి: ఏపీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో సామాజిక న్యాయం జరిగిందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వెనకబడిన వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అండగా నిలుస్తున్నారని గుర్తుచేశారు. కేబినెట్లో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అవకాశం కల్పించారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పెద్ద మానవతావాది అని స్పీకర్ కొనియాడారు.



కేబినెట్లో అణగారిన వర్గాలకు సీఎం జగన్ గొప్ప అవకాశం కల్పించారని పేర్కొన్నారు. బీసీలకు దామాషా పద్ధతిన పెద్ద ఎత్తున రాజాధికారం ఇచ్చారని తెలిపారు. ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరుస్తున్నారని తెలిపారు. టీడీపీకి బీసీలు ఎప్పుడో దూరమైపోయారని అన్నారు. కేబినెట్లో అందరికీ సమాన న్యాయం జరిగిందని స్పీకర్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

బుధవారం 13 ఏప్రిల్ 2022

## అగ్రరాజ్యాల మధ్య కోల్డ్ వార్

ఉక్రెయిన్‌పై రష్యా దాడికి వ్యతిరేకంగా మార్చి 2న ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ప్రవేశ పెట్టిన తీర్మానానికి 141 దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. చైనా, భారత్ సహా 35 దేశాలు గైర్హాజరయ్యాయి. అంతేకాదు, యుద్ధ నేపథ్యంలో ముందుకు వచ్చిన అన్ని తీర్మానాలలో అవి తమ తటస్థ వైఖరిని కొనసాగించాయి. రష్యా, ఉక్రెయిన్‌తో గల వ్యూహాత్మక సంబంధాలు దెబ్బతిన కూడదనే అవి తటస్థ వైఖరి తీసుకున్నాయి. ఉదాహరణకు, రెండు దేశాలలో భారతీయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. యుద్ధ ప్రాంతం నుంచి విద్యార్థుల తరలింపులో నో వార్ జోన్ కోసం రష్యాతో తన స్నేహాన్ని భారత్ ఉపయోగించాల్సి వచ్చింది. అలాగే రష్యా తక్కువ ధరలకు భారత్‌కు చమురు సరఫరా చేస్తోంది.రష్యా, బ్రిటన్ విదేశాంగ మంత్రులు గత వారం న్యూ ఢిల్లీ వచ్చారు. ద్వైపాక్షిక వ్యాపార, వాణిజ్యం మునపటిలా కొనసాగేలా చూసేందుకు ప్రస్తుత పరిణామాలపై వారు తమ వాదనను భారత్‌కు వినిపించటమే ఈ పర్యటనల ప్రధాన ఉద్దేశం. ఎప్పటిలాగే ఈ చర్చలకు సంబంధించి తక్కువగా చెప్పి ..ఎక్కువ దాచిపెడుతూ దౌత్య ప్రకటనలు వెలువడ్డాయి.సమయంలో భారత్‌లో పర్యటించిన అమెరికా డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ బహిరంగంగానే భారత్‌ను బెధిరించే ప్రయత్నం చేశారు. వాస్తవాధీన రేఖను చైనా ఉల్లంఘిస్తే రష్యా రక్షిస్తుందా.. అని ప్రశ్నించటం నిజంగా పెద్ద బెధిరింపే. ఇటీవల కాలంలో భారత్‌పై మరో దేశం చేసిన అత్యంత బహిరంగ బెదిరింపుగా ఈ ప్రకటనను చూడాలి. ఇది ఓ సార్వభౌమ దేశంపై మరో దేశం జరిపిన దురాక్రమణ కన్నా తక్కువ కాదు. ప్రపంచానికి తానే పెద్దన్నగా ఉండాలని, తాను గీసిన గీతను ఏ దేశం జవ దాటకూడదనే దాపి దశాబ్దాల విదేశాంగ విధానానికి ఈ ప్రకటన అద్దంపడుతుంది.ఇతర దేశాల సొంత వ్యవహారలలో తల దూర్చటం అమెరికాకు కొత్త కాదు. అనేక యుద్ధాలలో ప్రత్యక్షంగా పాల్గొంది. అలాంటి ప్రతిసారి ఏదో ఒక కారణాన్ని ప్రపంచానికి చూపించే ప్రయత్నం చేస్తుంది. ఉదాహరణకు మానవ హక్కులు..ప్రజాస్వామ్య పరిరక్షణ. అణ్వాయుధ తయారీ వంటివి. నిజంగా అమెరికాకు ప్రపంచం మీద అంత ఆందోళన చెంది ఉంటే గత వంద సంవత్సరాలలో అది 40 యుద్ధాలలో ఎలా పాల్గొంటుంది? దానికి బదులు ఓ పెద్దన్నగా వాటిని నివారించి ఉండాలి. కానీ, అమెరికా ఎప్పుడూ అలా చేయదు..దానికి తన ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం.తన వ్యూహాత్మ స్వీయ ప్రయోజనాల కోసం వేరొక సార్వభౌమ దేశం అంతరంగిక వ్యవహారాల్లో వేలు పెట్టటం అమెరికాకు అలవాటుగా మారింది. ఆ దేశాల విషయంలో అత్యంత దూకుడుగా వ్యవహరిస్తుంది. అలాంటి ఎన్నో సందర్భాలలో భారత్ వంటి అనేక దేశాలు అందులో జోక్యం చేసుకోలేదు. కానీ తమ సార్వభౌమత్వాన్నే ప్రశ్నించే పరిస్థితి వస్తే ఊరకే ఉండవు కదా.అమెరికా పెట్టుబడిదారీ భావజాలం.. దాని విధానాలు పాలు నీళ్లలా కలిసిపోతాయి. పాలసీ లాబీయింగ్ నుంచి ప్రపంచ మార్కెట్‌పై గుత్తాధి పత్యం వరకు అన్నీ తనకే కావాలనటం అమెరికా అత్యాశ. ఆహారం, దుస్తుల నుంచి ఆయుధ వ్యాపారం వరకు అన్ని రంగాలలో తమ కంపెనీలు మాత్రమే ఉండాలనే కోరుకునే దురాశ దానిది. తాజా ప్రపంచ పరిణామాలతో, వివిధ దేశాలపై అది విధించిన ఆంక్షలతో మొదటికే మోసం వచ్చే పరిస్థితి ఏర్పడింది. ప్రపంచ వాణిజ్యంలో డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీపై ప్రయత్నాలు ఇప్పటికే వేగవంతమయ్యాయి. కాబట్టి డాలర్ ఆధారిత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు, మార్కెట్లపై తన ప్రభావాన్ని కోల్పోవడం గురించి అమెరికా ఇప్పుడు ఆందోళన చెందడంలో ఆశ్చర్యం లేదు. ప్రపంచ వాణిజ్యంపై తన ప్రభావాన్ని , నియంత్రణను కోల్పోకుండా ఉండేందుకు ఇప్పుడు దౌత్యం రంగులు అద్దుతోంది.చైనా, భారత్‌తో అమెరికా, రష్యా (నాటి సోవియట్ యూనియన్) గత సంబంధాల మూలాలను పరిశీలిస్తే వాటి ప్రస్తుత వైఖరికి కారణాలు బోధపడతాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ వ్యతిరేక జిహాద్ చైనా, అమెరికాలు ఒకే పడవలో ప్రయాణించేలా చేసింది. తియనాన్మెన్ స్క్వేర్ ఊచకోత చరిత్ర ఉన్నప్పటికీ చైనా వినియోగ ప్రపంచంలోకి అడుగుపెట్టింది. వాస్తవానికి, 1998లో అణు పరీక్ష జరిగినప్పుడు ఈ రెండు దేశాలు భారతదేశానికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకున్నాయి. ఇందుకోసం అవి భద్రతా మండలిలో తమ శాశ్వత సభ్యత్వాన్ని ఉపయోగించుకున్నాయి. మరోవైపు, పూర్వపు సోవియట్ యూనియన్, భారతదేశం సుదీర్ఘ కాలం స్నేహ సంబంధాలు పంచుకున్నాయి. ఇరు దేశాల వారి రాజకీయ సిద్ధాంతాలు భిన్నమైనప్పటికీ మంచి ద్వైపాక్షిక సంబంధాలు కలిగి ఉన్నాయి. ప్రస్తుత రష్యా కూడా భారతదేశానికి నమ్మకమైన మిత్రదేశంగా కొనసాగుతోంది. భారత్ అనుసరిచే ప్రాంతీయ వ్యూహాలకు రాజకీయ మద్దతు ఇవ్వటంతో పాటు స్థిరమైన ద్వైపాక్షిక వాణిజ్య భాగస్వామ్యం, సైనిక సాయం చేస్తూ పాత స్నేహానికి కట్టుబడింది.మరోవైపు, భారత్ ఇప్పుడు ప్రాంతీయ శక్తిగా ఎదిగే క్రమంలో ఉంది. ఎవరికీ తల వంచిన చరిత్ర భారత్‌కు లేదు. రాజకీయ, సైద్ధాంతిక విభేదాలన్నా అన్ని దేశాలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తోంది. పెరుగుతున్న చైనా దూకుడు అడ్డుకోవటానికి అమెరికాతో కూడా స్నేహాన్ని పెంచుకుంది. ఇక్కడ రష్యా గురించి కూడా చెప్పాల్సి వుంటుంది. అమెరికా, చైనాతో బేరసారాల కోపం రష్యాతో సైనిక, వాణిజ్య సంబంధాలను కొనసాగించడం భారత్‌కు వ్యూహాత్మక అవసరం. అలాగే భారత్ తన పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయటానికి, నెట్ జీరో 2070 లక్ష్యాల కోసం విదేశీ మూలధన పెట్టుబడులు సమకూర్చుకోవాల్సి వుంటుంది.రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో భారత్ సరైన వైఖరి తీసుకుంది. ఈ శతాబ్దంలో ప్రాంతీయ, ప్రపంచ శక్తులు మారే అవకాశం ఉన్నందున భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్ ఇప్పటికే తన యువ జనాభాతో ప్రపంచ ప్రభావశీల శక్తిగా అవతరించనుంది. తన చారిత్రక దృక్పథం, తత్వ చింతనతో ప్రపంచ శక్తిగా మరింత బలపడుతుందనటంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. బాధ్యతలకు దూరంగా వెళ్లకపోవటం.. బెధిరింపులకు లొంగకపోవటమే భారత్ బలం!!

## ఊహించని పదవి తెచ్చుకున్న.ఉషా శ్రీ చరణ్



అనంతపురం, ఏప్రిల్ 12, ఆంధ్రప్రదేశ్ లోని ఆ జిల్లాలో 12మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు? అందులో సీనియర్ నాయకులు ఉన్నారు.. రెండు సార్లు ఎమ్మెల్యే అయిన వారు ఉన్నారు.. సీఎం జగన్ కు సన్నిహితంగా ఉన్న వారు కూడా ఉన్నారు. కానీ ఆ మహిళా ఎమ్మెల్యేనే ఎందుకు క్యాబినెట్ లో తీసుకున్నారు. వివాదాలకు కేరాఫ్ గా ఉన్న ఆమెకే ఎందుకు మంత్రి పదవి ఇచ్చారు..? సామాజిక వర్గ ఈక్వేషన్సా.. లేక ఇతర కారణం ఏదైనా ఉందా?? అనుకోకుండా లక్కీ ఛాన్స్ కొట్టి మంత్రి అయిన ఆ మహిళా నేత గురించి తెలుసుకుందాం..ఉషా శ్రీ చరణ్.. ఈ పేరు మంత్రి వర్గంలో ఉంటుందని ఎవరూ ఊహించలేకపోయారు. ప్రత్యేకించి అనంతపురం జిల్లాలో వైసీపీ నేతలు మాత్రం దీనిని అస్సలు ఊహించలేదు. మొదటి నుంచి మంత్రి వర్గ రేస్ ఈ పేరు ఉన్నా.. గత రెండు రోజులుగా ఆమె రేస్ లో వెనుకబడ్డారని చెప్పాలి. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతితో పాటు పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణకు మరోసారి అవకాశం ఇస్తున్నట్టు ప్రచారం జరిగింది. అయితే సాయంత్రం 5గంటల తరువాత అందరికీ ఊహించని షాక్ తగిలింది. రేస్ లో వెనుకబడ్డ ఉషా శ్రీ చరణ్ మంత్రి ఖరారైనట్టు సమాచారం. ఇది జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంతలో మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామికి మంత్రి పదవి అని చెప్పడంతో ఇది మరింత షాక్ కల్గించింది. ఎందుకంటే తిప్పేస్వామి దాదాపుగా రేస్ లో లేరు. మరోవైపు ఉష శ్రీ చరణ్ కు మంత్రి రాదనుకుంటున్న తరుణంలో ఇలాంటి నిర్ణయం రావడం అందర్నీ విస్మయానికి గురి చేసింది?.ఇంతకీ ఎందుకు అందరికీ ఆశ్చర్యం కల్గించింది? అసలు మంత్రి కావడానికి దోహద పడిన అంశాలేంటంటే? వాస్తవంగా జిల్లాలో కురుబ సామాజిక వర్గం ఎక్కువ. అందుకే శంకర్ నారాయణకు తొలి క్యాబినేట్ లోనే అవకాశం దక్కింది. ఆయన తొలి సారి ఎమ్మెల్యే అయినా ఆయనకు మంత్రి పదవి వచ్చింది. మరోసారి కూడా ఆయన రేస్ లో ఉన్నారు. అదేంటి మహిళా కోటలో అదే సామాజిక వర్గానికి చెందిన ఉషా శ్రీ చరణ్ ఉన్నారని డౌట్ రావచ్చు. అందునా సీఎం జగన్ కు సన్నిహితులనే పేరు ఉంది. మరి ఆమె ఎందుకు రేస్ లో లేరంటే.. కళ్యాణదుర్గంలో సొంత పార్టీ నేతల నుంచి ఆమె తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. మంత్రి పునర్వ్యస్థీకరణకు రెండు రోజుల ముందు కూడా ఒక అధికార పార్టీ కౌన్సిలర్ ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేశారు. అంతే కాదు మన్సిపల్ కార్యాలయం వేదికగా తన సోదరునిపై దాడి చేయించారని ఆరోపించారు. అంతముందు జడ్పీటీసీ, మున్సిపల్ ఛైర్మన్ ఇలా వరుస బెట్టి ఆమెపై దండయాత్ర చేశారు. ఇంత వ్యతిరేకత ఉన్న సమయంలో ఆమెకు కచ్చితంగా మంత్రి పదవి రాదని జిల్లాలో ప్రచారం సాగింది?కురుబ సామాజిక వర్గానికి చెందిన శంకర్ నారాయణను కొనసాగిస్తున్నట్టు మొదట సమాచారం అందింది. కానీ రెండవ సారి మంత్రి వర్గంలోకి తీసుకునే వారి సంఖ్య ఎక్కువ కావడం.. క్యాబినేట్ నుంచి తొలగించిన వారిన అసంతృప్తిని పసిగట్టి చివరి నిమిషంలో వివాదాలు ఉన్నా.. ఉషాశ్రీ చరణ్ వైపు సీఎం జగన్ మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. మరోవైపు ఇది కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే ఉషాశ్రీని బలపరిచే వర్గం కూడా బలంగా ఉంది. అందుకే ఆమెకు మంత్రి అనౌన్స్ కాగానే భారీగా సంబరాలు జరిగాయి. నియోజకవర్గంలో ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నా.. ఉషాశ్రీకు ప్రధానంగా సామాజిక వర్గం కలిసి వచ్చిందనే టాక్ ఉంది. ఇక మంత్రిగా ఆమె కళ్యాణదుర్గంలో అడుగు పెట్టిన తరువాత రాజకీయాలు ఎలా ఉంటాయన్నది కాస్త ఆసక్తిగా చూస్తున్నారు?మొత్తం మీద ఉషాశ్రీ చరణ్ కు మంత్రి పదవి రావడం ఒకింత ఆశ్చర్యాన్ని కల్గిస్తే.. ముగ్గురు నేతల్లో తీవ్ర అసంతృప్తి కనిపించింది. దాదాపు పేర్లు ఖారారైన టైంలో మార్పులు జరిగాయాని అనుచర వర్గం ఒకింత ఆగ్రహంగా ఉంది. అయితే ఇప్పటి వరకు ఎక్కడా దీనిపై నిరసనలు మాత్రం కనిపించలేదు

## కరెంట్ కోతలతో ఆక్వా షాక్

రాజమండ్రి, ఏప్రిల్ 12, విద్యుత్తు కోతలతో కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని అక్వా రైతులు బెంబేలెత్తుతున్నారు. రొయ్య పిల్లలను కాపాడుకోవడానికి రొటేవేటర్ల నిర్వహణకు డీజిల్ మోటార్లను వినియోగించాల్సి రావడంతో పడుతోన్న అదనపు భారంతో గగ్గోలు పెడుతున్నారు. ఈ మూడు జిల్లాల పరిధిలో అధికారికంగా 55 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో రొయ్యలకు మంచి ధర లభించింది. 30 కౌంట్‌కు రూ.610 చొప్పున అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పలికింది. ఈ నేపథ్యంలో వేసవి సాగు కూడా లాభాల పంట పండిస్తుందని రైతులు ఉత్సాహంగా ఆక్వా సాగు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రోజులుగా రోజుకు ఎనిమిది గంటలు అప్రకటిత విద్యుత్తు కోత విధిస్తుండడంతో వీరి ఆశలను నీరుగార్చాయి. రైతులు కనీసంగా ఐదు నుంచి పది ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. ఎకరాకు నాలుగు లక్షల రూపాయల వరకూ పెట్టుబడి అవసరమవుతుంది. వంద రోజుల తరువాత పంట చేతికి అందుతుంది. ప్రస్తుతం మూడు జిల్లాల్లో పంట 50 నుంచి 60 రోజుల మధ్యలో ఉంది. రొయ్యలకు మేత, మందులు, ఆక్సిజన్ వంటివి ఏమి తగ్గినా నష్టం లక్షల రూపాయల్లో ఉంటుంది. ఈ కారణంగా పంటను కంటికిరెప్పలా కాపాడుకోవాల్సి వస్తోంది. ఆక్సిజన్ శాతం తగ్గితే రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో, రొయ్యలకు ఆక్సిజన్‌ను అందించేందుకు రొటోవేటర్లను 24 గంటలూ వినియోగంలో ఉంచుతారు. ఇవి విద్యుత్తుతో నడుస్తుంటాయి. ప్రస్తుతం విద్యుత్తు కోతల వల్ల రొటోవేటర్ల నిర్వహణకు డీజిల్ ఇంజిన్లను వాడుతున్నారు. పెద్ద రైతులు మాత్రం జనరేటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. డీజిల్ ఇంజిన్ ద్వారా రొటోవేటర్లను వినియోగించాలంటే ఒక ఎకరాకు గంటకు 30 లీటర్ల డీజిల్ అవసరం. ప్రస్తుతం లీటరు డీజిల్ ధర రూ.106కు చేరింది. గంటకు రూ.3,180 డీజిల్‌కు ఖర్చు చేయాల్సి ఉంది. నిర్వహణ ఖర్చులు కలిపి గంటకు రూ.3,500 చొప్పున అదనపు ఖర్చు అవుతోంది. మూడు జిల్లాల్లో గంటకు రూ.19.25 కోట్లు అదనపు భారం పడుతోంది. ఎనిమిది గంటల పాటు కోతలు ఉంటే, రోజుకు రూ.154 కోట్ల వరకూ అదనపు భారం పడుతోంది.రోజుకు ఎనిమిది గంటలు రాత్రి వేళల్లో విద్యుత్తు కోత విధిస్తున్నారు. ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని రొయ్యలు సాగు చేస్తున్నాను. విద్యుత్తు కోత వల్ల రోజుకు రూ.28 వేలు ఖర్చు పెరిగింది. పరిస్థితి ఇలాగే ఉంటే పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోతాం. ప్రభుత్వం చొరవ తీసుకోవాలి అంతరాయాలు లేకుండా విద్యుత్తు సరఫరా అందించాలని కోరుతున్నారు

## వ్యవసాయానికి యువత దూరం

విజయవాడ, ఏప్రిల్ 12, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధాన రాష్ట్రం. జనాభాలో 70 శాతం మంది ఆ రంగంపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. జనాభాలో గణనీయ భాగంగా ఉండి సమాజాన్ని ఆర్థికంగా, మానవ వనరులపరంగా అభివృద్ధి పథంలో నడిపించాల్సిన యువత వ్యవసాయ కార్యకలాపాల పట్ల విముఖంగా ఉన్నారని, బొత్తిగా అటు వైపు ఆకర్షితులు కావడం లేదని వ్యవసాయ భూకమతాల (ల్యాండ్ హోల్డింగ్స్)పై ప్రభుత్వం నిర్వహించిన మూడవ దశ ఇన్‌పుట్ సర్వే (2016-17)లో వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా 85.19 లక్షల కమతాలుండగా కేవలం 2.29 లక్షలు మాత్రమే 18-30 సంవత్సరాల వయసు కలిగిన వారి చేతుల్లో ఉన్నాయి. అసలు 18 సంవత్సరాల లోపు కమతాలు లేనే లేవు. రైతు సగటు వయసు 49 ఏళ్లకుపైనే. రైతుల్లో మధ్యస్థ వయస్కులే అత్యధికం. 41-50 ఏళ్ల లోపు వారు 31.54 లక్షలు. మొత్తం రైతుల్లో వీరే గణనీయం. వీళ్ల వాటా 37.02 శాతం. ఆ తర్వాత 51-60 ఏళ్ల లోపు రైతులు 25.78 లక్షలు. మొత్తం రైతుల్లో వీరి వాటా 30.26 శాతం. 41-50, 51-60 రెండు కేటగిరీలూ కలిపితే 57.32 లక్షల కమతాలు. ఇక 61-65 ఏళ్ల లోపు రైతులు 6.77 లక్షలు (7.94 శాతం) కాగా, 66 సంవత్సరాలకు పైబడిన వారు 5.41 లక్షలు (6.35 శాతం).18-30 ఏళ్ల లోపు రైతులందరూ కలుపుకొని 2.29 లక్షలుండగా వారిలో సన్నకారు రైతులే ఎక్కువ. 1.56 లక్షల మంది వారే. ఆ ఏజ్ గ్రూపులో గల మొత్తం రైతుల్లో సన్నకారు వాటా 68.15 శాతం. 31-40 ఏజ్ గ్రూపులో సైతం సన్నకారు రైతులే ఎక్కువ. మొత్తం ఆ ఏజ్ గ్రూపులో 13.41 లక్షల మంది ఉండగా, 9.57 లక్షల మంది (71.40 శాతం) సన్నకారు రైతులే.మిగతా కేటగిరీలతో పోల్చితే మధ్యతరగతి, పెద్ద రైతుల వయసు ఎక్కువ. రైతు సగటు వయసు 49.05 ఏళ్ల నుంచి 52.88 ఏళ్లు కాగా, మీడియం రైతుల సగటు వయసు 51.95 సంవత్సరాలు,

పెద్ద రైతుల సగటు వయసు 52.88 ఏళ్లు.మొత్తం రైతుల్లో నిరక్షరాస్యులు 23.24 లక్షలు కాగా, వారిలో సన్నకారు రైతులు 16.85 లక్షలు (72.49 శాతం), చిన్న రైతులు 4.17 లక్షలు (17.94 శాతం). ఐదవ తరగతి లోపు చదువుకున్న మొత్తం రైతుల సంఖ్య 19.05 లక్షలు కాగా, చిన్న రైతులు 3.39 లక్షలు. ఏడో తరగతి లోపు రైతులు 20.04 లక్షలు. రైతుల్లో డిగ్రీ, అంతకంటే ఎక్కువ చదువుకున్నవారు 2.65 లక్షలు. వారిలోనూ సింహభాగం సన్నకారు రైతులే.

## ప్రైవేట్ పోర్టులతో పోటీ

విశాఖపట్టణం, ఏప్రిల్ 12, డో అత్యధిక రికార్డును నమోదు చేసినట్లు వీపీఏ చైర్మన్ కె.రామమోహనరావు వెల్లడించారు. శుక్రవారం సిరిపురం ప్రాంతంలో ఉన్న పోర్టు అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 89 ఏళ్ల పోర్టు చరిత్రలో రెండేళ్ల క్రితం 72.72 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ చేసి రికార్డు సృష్టించగా.. ఈ ఏడాది కాస్త తగ్గినట్లు వివరించారు.ఈ సంవత్సరం థర్మల్ కోల్‌లో 100 శాతం, స్టీమ్ కోల్‌లో 38 శాతం, కంటైనర్స్‌లో 0.05 శాతం వృద్ధి ఉన్నప్పటికీ.. కోవిడ్, హెచ్‌పీసీఎల్ ఆధునీకరణ వంటి కారణాల వల్ల ఆయిల్ 11 శాతం తగ్గినట్లు చెప్పారు. అలాగే ఐరన్ ఓర్ 23 శాతం, కోకింగ్ కోల్‌లో 18 శాతం క్షీణత ఉందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో 160, 170 డాలర్లకు వెళ్లిన టన్ను ఐరన్ ఓర్ ధర 90 డాలర్లకు పడిపోయిందన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. 5 ఏళ్లలో 78 మెట్రిక్ టన్నులు లక్ష్యం, వీపీఏ వచ్చే ఐదేళ్లలో 78 మెట్రిక్ టన్నుల కార్గో హాండ్లింగ్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా అన్‌రాక్, ఎన్ఎండీసీ, తమిళనాడుకు చెందిన టాన్‌జెన్‌కోతో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఇక్కడ నుంచి దేశంలో ముంబై, గోవా వంటి ప్రాంతాలకే కాకుండా ఇతర దేశాలకు క్రూయిజ్‌లో వెళ్లే సౌకర్యం మరో ఏడాదిలో అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. 2 వేల మంది ప్రయాణికుల సామర్థ్యానికి తగ్గట్లుగా దీన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయిలో ఫిషింగ్ హార్బర్.. సాగరమాల కార్యక్రమంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌లో భాగంగా విశాఖలో రూ.150 కోట్లతో ప్రపంచ స్థాయి ఫిషింగ్ హార్బర్‌ను వచ్చే ఏడాదిలోగా తయారు చేయనున్నట్లు స్పష్టం చేశారు.సాగరమాల ప్రాజెక్టు కింద విశాఖ పోర్ట్ అథారిటీ పరిధిలో రూ.3,769 కోట్లతో 23 ప్రాజెక్టులు, పనులు చేపట్టినట్లు చెప్పారు.వీటిలో కొన్ని నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. సీహార్స్ జంక్షన్ నుంచి డాక్ ఏరియాకు ఫ్లైఓవర్ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇన్నర్ హార్బర్‌లో ఓఆర్?1, ఓఆర్?2 బెర్తులు 366 మీటర్ల నుంచి 606 మీటర్లకు పొడవు పెంపు పనులు వచ్చే ఏడాది నాటికి పూర్తవుతాయన్నారు. వీటితో పాటు 38 కిలోమీటర్లు రైల్వేలైన్ ఎలక్ట్రిఫికేషన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. పోర్టు బొగ్గు, ఇనుప ధాతువుల ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్న నేపథ్యంలో దుమ్ము, ధూళి పైకి లేవకుండా కవర్‌షెడ్ల నిర్మాణానికి టెండర్లు ఇచ్చినట్లు చెప్పారు. డబ్ల్యూక్యూ?7, 8 బెర్తుల్లో బొగ్గు, ఇనుప ఖనిజాలను హ్యాండిల్ చేస్తున్నపుడు వచ్చే దుమ్ము, ధూళిని నియంత్రించేందుకు పీపీపీ పద్ధతిన యాంత్రీకరణ పనులు చేస్తున్నట్లు చెప్పారు.ప్రైవేట్ పోర్టులతో పోటీ ఉన్న మాట వాస్తవమే.

## కులాలపైనే కోటి ఆశలు

విజయవాడ, ఏప్రిల్ 12, రాజకీయాల్లో కులాల ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. అది నిజమే. ఎవరూ కాదనలేరు. కానీ కులాలను బట్టుకుని వెళ్లాడితే ఆ కులం మొత్తం గంపగుత్తగా పార్టీకే ఓట్లు వేస్తారా? అంటే మరి జగన్ కే తెలియాలి. కొత్త మంత్రి వర్గం జాబితాను చూస్తుంటే జగన్ పక్కా 2024 ఎన్నికల కేబినెట్ ను రూపొందించుకున్నట్లు కనపడుతుంది. ఆరోపణలున్న వారిని, పార్టీ నేతలు స్థానికంగా వ్యవహరిస్తున్న వారికి కూడా జగన్ మంత్రి పదవులు ఇచ్చారు. కేజగన్ పార్టీ పరిస్థితిని, వారికున్న కేపబులిటీని చూడలేదు. కేవలం కులాన్ని మాత్రమే చూసి మంత్రి వర్గంలోచోటు కల్పించారు. రేపు ప్రచారం లో తాను ఈ కులాలకు ప్రాధాన్యత ఇచ్చానని, తనకే ఓటు వేయాలని కోరుకోవడానికి మాత్రమే ఇది ఉపయోగపడుతుంది. ఎందుకంటే అనంతపురం జిల్లాలో ఉషశ్రీ చరణ? ను కల్యాణదుర్గం స్థానిక నాయకత్వమే వ్యతిరేకిస్తుంది. ఆమె ఎప్పుడూ బెంగళూరులోనే ఉంటారన్న విమర్శలున్నాయి. కేవలం కురుబ సామాజికవర్గం కాబట్టి ఆమెకు జగన్ తన కేబినెట్ లో చోటు కల్పించారు. ఇక పాతమంత్రి గుమ్మనూరి జయరాంపై గతంలోనే అనేక ఆరోపణలు వచ్చాయి. ఈఎస్ఐ స్కామ్ లో ఆయన కుమారుడు పాత్రను టీడీపీ నేతలు ఫొటోలతో సహా బయటపెట్టారు. ఇక తన నియోజకవర్గంలో అనేకసార్లు పేకాట క్లబ్ లను మంత్రి వర్గీయులు నిర్వహిస్తూ పట్టుబట్టారు. కానీ జగన్ ఇదేమీ పట్టించుకోలేదు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో బోయ సామాజికవర్గం ఎక్కువగా ఉంది. వారిని తనవైపునకు తిప్పుకునేందుకే జగన్ గుమ్మనూరి జయరాంకు మంత్రి పదవిని రెన్యువల్ చేశారు. ఎన్ని సార్లు గెలిచారన్నది చూడలేదు. తొలి సారి గెలిచిన వారికి కూడా కేబినెట్ లో చోటు దక్కింది. గుంటూరు జిల్లాలో కమ్మ రెడ్డి సామాజికవర్గం ఎక్కువగా ఉన్నా అక్కడ కాపు, రజక, ఎస్సీలకే అవకాశమిచ్చారు. గత ఎన్నికలంటే అంతా జగన్ మీద నడిచింది. ఈసారి ఆ పరిస్థి??తి ఉంటుందన్న గ్యారంటీ లేదు. కానీ జగన్ గత ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన కులాల ఈక్వేషన్లనే తిరిగి నమ్ముకున్నారు. కానీ రెడ్డి సామాజికవర్గంలో ఉన్నామని వారిని పదవులకు పూర్తిగా దూరం పెడితే ఎలా అని ప్రశ్నలు వినపడుతున్నాయి. ఇప్పుడు తమ అసంతృప్తిని బహిరంగంగా బయటపెట్టింది రెడ్డి సామాజికవర్గం నేతలే. కొత్త మంత్రివర్గంలో రెడ్లకు దక్కింది నాలుగు పదవులే. జగన్ కులాలను చూశారు తప్పించి సమర్థత, పార్టీని వచ్చే ఎన్నికల్లో గెలుపు తీరాలకు తీసుకెళ్లడంలోనూ, జిల్లా మొత్తాన్ని ప్రభావం చేయగలిగిన వారు ఈ 25 మందిలో కేవలం పది మంది మాత్రమే ఉంటారు. మిగిలిన వారు రెండేళు మంత్రిగా పనిచేసినా వారి నియోజకవర్గంలో గెలవడం కష్టమేనన్నది వాస్తవం. మరి జగన్ తన ఛరిష్మా ఉన్నప్పుడే కుల సమీకరణాలు వర్క్ అవుట్ అవుతాయి. అభ్యర్థుల మీద ఈసారి ఎన్నికల్లో ప్రజలు ఆధారపడితే జగన్ అంచనాలు దారుణంగా ఫెయిలయినట్లే.

## వినయ విధేయులకు పెద్ద పీట

విజయవాడ, ఏప్రిల్ 12,ఏదైనా ఒక పని చేయాలంటే ధైర్యం కావాలి. పార్టీ పై పట్టు ఉండాలి. అసంతృప్తులు తలెత్తకుండా చూసుకోవాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, ఆ తర్వాత విభజన ఆంధ్రప్రదేశ్ లోనూ ఈ స్థాయిలో మంత్రి వర్గ విస్తరణ ఎప్పుడూ జరగలేదు. తెలుగుదేశం పార్టీలోనూ వైసీపీ మంత్రి వర్గ విస్తరణ ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. చంద్రబాబు తాను ముఖ్యమంత్రి గా ఉన్న మూడు సార్లు ఇంత స్థాయిలో మంత్రివర్గ విస్తరణ చేపట్టలేదు. బాబు హయాంలో.... చంద్రబాబు మంత్రి వర్గ విస్తరణ చేపట్టారు కానీ పూర్తి స్థాయిలో మంత్రి వర్గాన్ని విస్తరించలేదు. మంత్రుల అందరి చేత రాజీనామాలు చేయించలేదు. ఆయన లెక్కలు సపరేట్. సీనియర్లకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. పార్టీని తొలి నుంచి నమ్ముకున్న వాళ్లు, సంక్షోభ సమయంలో తనకు అండగా నిలబడిన వారికే చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తారు. చంద్రబాబు మంత్రివర్గంలో యనమల రామకృష్ణుడు, కోడెల శివప్రసాద్, అయ్యన్న పాత్రుడు, అచ్చెన్నాయుడు వంటి వారు ఖచ్చితంగా ఉంటారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన.... దీంతో పాటు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం కల్పించి పార్టీలో తొలి నుంచి ఉన్న వారికి షాకులు ఇచ్చారు కూడా. అధికారంలో ఉండబట్టి అసంతృప్తులు తలెత్తలేదు. బొజ్జల గోపాల కృష్ణారెడ్డి వంటి వారు బహిరంగంగానే అభ్యంతరం వ్యక్తం చేసినా సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. 2014లో గెలిచిన తర్వాత వైసీపీ నుంచి వచ్చిన నలుగురికి మంత్రి పదవులు ఇవ్వడం అప్పట్లో పార్టీలో చర్చనీయాంశమైంది. .. కానీ జగన్ మాత్రం ఇవేమీ చూసుకోరు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి నో ఛాన్స్. కేవలం సామాజిక సమీకరణాలనే జగన్ నమ్ముకుంటున్నారు. తొలిదశ మంత్రివర్గ విస్తరణలోనూ ఊహించని వారికి మంత్రి పదవులు దక్కాయి. రెండో దశలోనూ అదే పరిస్థితి కన్పిస్తుంది. ఇప్పుడు టీడీపీలో చంద్రబాబు, జగన్ మంత్రివర్గ విస్తరణపై నేతలు బేరీజు వేసుకుంటున్నారు. పైకి అనలేకపోయినా జగన్ గట్స్ ను వారు అంతర్గతంగా మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నారు.

## పరిశ్రమలపై తీవ్ర ప్రభావం

విజయనగరం, ఏప్రిల్ 12, విద్యుత్తు కోతల ప్రభావం పారిశ్రామిక రంగంపై తీవ్రంగా పడింది. రోజురోజుకూ పెరిగిన విద్యుత్ కోతలతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ప్రభుత్వం పరిశ్రమలకు పవర్ హాలిడే ప్రకటించింది. దీంతో పారిశ్రామిక ప్రాంతమైన గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమలకు విద్యుత్ కష్టాలు మొదలయ్యాయి. గృహ వినియోగాలకు విద్యుత్ కోతలు తగ్గించి పరిశ్రమలకు విద్యుత్ కోతలు పెంచింది ప్రభుత్వం. విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ ఉత్పత్తి పెరగక పోవడంతో విద్యుత్ కష్టాలు తప్పడం లేదని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.వారానికి ఒకరోజు పవర్ హాలీడేపరిశ్రమలకు వారానికి ఒకరోజు పవర్ హాలీడే ప్రభుత్వం ప్రకటించింది. విద్యుత్ ఆధారంగా మైతాన్, బెర్రీ, హిరా, సహారా, అరోరా వెంకటేశ్వర, సిరి, ఎండిఏ ఫెర్రో పరిశ్రమలు నడుస్తున్నాయి. వీటికి వారానికి ఒకరోజు పవర్ హాలీడే ప్రకటించారు. ఈనేపథ్యంలో కార్మికులపై తీవ్ర ప్రభావం పడనుంది. పవర్ హాలీడే రోజున కార్మికులకు పని దొరికే పరిస్థితి లేదు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి విద్యుత్ పూర్తిగా సరఫరా చేయాలని కార్మికులు కోరుతున్నారు. రోజుకు 12గంటలు మాత్రమే ఫుల్ లోడ్‌గ్రోత్ సెంటర్లో ఫెర్రో పరిశ్రమలతో పాటు కెమికల్ పరిశ్రమలు, పేపర్ మిల్లు, బాయిలర్ ఇటుక తయారీ పరిశ్రమలు, సిమెంటు ఇటుక తయారీ, వర్క్ షాపులు, వాటర్ ప్లాంట్, గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. ఆయా పరిశ్రమలకు సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6గంటల వరకు లైట్లు, ఫ్యాన్లకు మాత్రమే విద్యుత్ వినియోగించాలని నోటీసులు జారీ చేశారు. ప్రతిరోజు సాయంత్రం 6గంటల నుంచి ఉదయం 6గంటల వరకు ఫెర్రో పరిశ్రమలు 50శాతం మాత్రమే విద్యుత్ వినియోగించాలి. దీంతో 12గంటలు పూర్తి లోడ్ తో పరిశ్రమలు నడవగా మిగిలిన 12గంటలు సగం లోడ్ తో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పత్తి కూడా తగ్గిపోనుంది.

## హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి

చంద్రగిరి తిరుపతి జిల్లా చంద్రగిరి మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ బాలికల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ ఎస్సీ, ఎస్టీ,బిసి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పిల్లలను చదివించే స్తోమత లేని నిరుపేద కుటుంబాల బాలికలను ప్రభుత్వ హాస్టల్ కు పంపుతున్నారని, అలాంటి పిల్లలకు రక్షణ కల్పించాల్సిన హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తుందని, అందుకు ఉదాహరణగా ఇటీవలే జరిగిన ఇద్దరు ఎస్సీ బాలికలే ఉదాహరణఅని వారు తెలియజేశారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని చంద్రగిరి సిఐ శ్రీనివాసులు కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ పోరాట వ్యవస్థాపకులు బాదూరు ఎల్లయ్య, యానాదులు సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు వరమాల గోపి, పరాల పరమేశ్, శంకర్, నాగేశ్వరరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## రూ 22500 విలువచేసే గుట్కా పట్టివేత.. ఒకరి అరెస్టు

**అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు**

బద్వేలు నెల్లూరు నుండి ఇ కొరియర్ పార్సిల్ ద్వారా బద్వేల్ కు అక్రమంగా తరలించిన రూ22500 విలువచేసే గుట్కా సంచులను సో సోమవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ జి వెంకటేశ్వర్లు తెలిపారు బద్వేలు పట్టణం ఆంజనేయ నగర్ వీధికి చెందిన వల్లంకొండూ రాము అనే వ్యక్తిని ఈ కేసులో అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు అతని ముద్దు నుండి 5540 చిన్న గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు ఈ ఈ దాడుల్లో అర్థం ఎస్ ఐ శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నట్లు సిఐ తెలిపారు

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జగ్గయ్యపేట జగ్గయ్యపేట జాతీయ రహదారి 65 మీద గౌరవరం సమీపం లో టెక్స్ టైల్స్ యూ టర్న్ దగ్గర జరిగిన బైక్, కారు ప్రమాదం జరిగింది. బైక్ మీద వెళుతున్న వారు సడన్ గా యూ టర్న్ తీసుకొనడం తో వెనుక వేగంగా వస్తున్న వాహనం కారు ఢీ కొట్టింది. ఘటలో కారు బైక్, ప్రయాణికులను ట్టడం తో సుమారు 20 మీ వరకు తీసుకువెళ్ళింది. కారు లో కూడా బాగా బ్రేక్స్ వేసిన ఆనవాలు ఉన్నాయని సమాచారం. ఘటనలో రావిరాల గ్రామానికి చెందిన ఒక మహిళ మృతి చెందింది. మరో ఇద్దరికీ గాయాలు అయ్యాయి.

## ఆ సర్పంచ్ ను శిక్షించాలి

విజయవాడ జగన్ రెడ్డి పాలనలో గజానికో వైసిపి గాంధారి కొడుకు పుట్టుకొచ్చి మహిళల్ని వేధిస్తున్నాడని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం కొత్తపల్లి గ్రామంలో వైసిపి సర్పంచ్ కన్నం శ్యామ్ బరితెగించి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న యువతిని ఫోన్లో వేధించాడు. ఆమెకు అండగా నిలిచిన స్నేహితుడు సుదర్శన్ శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడేలా పోలీసులతో కలిసి బెదిరించాడు. వైసిపి నాయకులే మహిళల పట్ల కాలయముల్లా మారి కాటేస్తుంటే గన్ కంటే ముందొస్తానంటూ సినిమా డైలాగ్స్ కొట్టిన జగన్ రెడ్డి గారు ఎక్కడ? యువతిని వేధించి ఆమె స్నేహితుడు ఆత్మహత్యకు కారణమైన సర్పంచ్, అతని అనుచరులు, ఈ దారుణానికి సహకరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని లోకేష్ డిమాండ్ చేసారు.

## తిరుమలకు వచ్చే భక్తులకు విజ్ఞప్తి

తిరుమల ప్రస్తుతం భక్తుల అధిక రద్దీ కారణంగా తిరుపతిలోని సర్వదర్శనం కౌంటర్లలో టోకెన్ల జారీని టీటీడీ నిలిపివేసింది. టోకెన్ లేకుండా కూడా భక్తులను సర్వదర్శనానికి తిరుమలకు అనుమతిస్తున్నారు. విపరీతమైన రద్దీ కారణంగా తిరుమలకు వెళ్లే భక్తులకు దర్శనం జాప్యం అయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం భక్తులు సంసిద్ధతతో తిరుమలకు రావాల్సిందిగా టీటీడీ కోరింది.

## మైనర్ బాలికకు గర్భం

**వరసకు అన్నే నిందితుడు**

నెల్లూరు పన్నెండేళ్లు అంటే చిన్నారులతో కలిసి పాఠశాలకు వెళ్లాల్సిన వయస్సు. అంత చిన్నవయసుకే ఓ బాలిక తొమ్మిదినెలల గర్భందాల్చిన ఘటన నివ్వెరపరిచింది. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలోని ఓ ఎస్టీ కాలనీలో ఉంటున్న దంపతులు ఐదేళ్లక్రితం విడిపోయారు. అప్పటికే వారికి ఇద్దరు కుమారులు. వారిని భార్య వద్ద వదిలేసి...భర్త వేరే యువతిని వివాహం చేసుకున్నాడు. ఆ యువతికి అప్పటికే ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కొన్నాళ్ల క్రితం ఈ రెండు కుటుంబాల మధ్య సఖ్యత కుదిరి..అందరూ ఒకే ఇంట్లో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో మొదటి భార్య పెద్దకుమారుడు కుమారుడు, అంటే వరసకు అన్న (20). బాధిత బాలిక (12)తో వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఈ విషయం కుటుంబానికి తెలిసేటప్పటికే బాధితురాలు గర్భం దాల్చింది. తొమ్మిది నెలలు నిండటంతో ప్రసవం కోసం కుటుంబసభ్యులు సోమవారం నెల్లూరులోని జీజీహెచ్కు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వైద్యులు నివ్వెరపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు

## అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలం శ్రీశైలం దేవస్థానం లో భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్ 19న ఈ కుంభోత్సవం నిర్వహించబడుతుంది. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు (కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, మొదలగునవి సమర్పించడం) ఈ కుంభోత్సవం జరిపించడం ఆనవాయితి. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం.కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతోంది. మంగళవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాధికాలు జరిపించడం జరిగింది. తరువాత అమ్మవారికి ఈ కొబ్బరికాయలను సమర్పించారు.

# శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

**క్యూలైన్లలో తొక్కిసలాట**



తిరుమల కోవిడ్ నిబంధనలు పాటిస్తూ శ్రీవారిని దర్శనం కల్పించేందుకు వీలుగా టీటీడీ ఆన్లైన్లో కోటా పెట్టి దర్శనం కల్పిస్తూ వస్తోంది.. శ్రీవారి సర్వదర్శన టికెట్లకు భారీ డిమాండ్ ఏర్పడింది.. సర్వదర్శనం టికెట్లు ఇచ్చే క్యూ లైన్ వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.. వేలాది మంది ఒక్కసారిగా రావడంతో తోపులాట జరిగింది.. ఓ దశలో తొక్కిసలాట కూడా జరిగినట్టు చెబుతున్నారు. క్యూలైన్లు పాక్షికంగా ధ్వంసం అయ్యాయి.. క్యూలైన్లో పలువరు భక్తులు సొమ్మసిల్లి పడిపోయారు. శ్రీవారి దర్శనానికి వచ్చిన పలువరు భక్తులు కన్నీటి పర్యంతం అయ్యారు.. టీటీడీ సరైన ఏర్పాట్లు చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గోవిందరాజస్వామి సత్రాల వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.. రంగంలోకి దిగిన తిరుపతి పోలీసులు భక్తులను కంట్రోల్ చేసి.. పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు.. క్యూ లైన్లలో తోపులాటలతో పదుల సంఖ్యలో భక్తులు సొమ్మసిల్లి పడిపోయారు.. తాగేందుకు కనీసం నీరు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేసి భక్తులు.. టికెట్ల జారీలో టీటీడీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. భక్తుల తోపులాటలో చాలామంది పిల్లలు తప్పిపోయినట్టు చెబుతున్నారు.. పోలీసుల లేకపోతే మా పరిస్థితి మరింత దారుణంగా ఉండేదని భక్తులు వాపోయారు.. ఇంత జరుగుతున్న టీటీడీ విజిలెన్స్ స్పందించలేదని విమర్శిస్తున్నారు.. ఇక, భక్తుల రద్దీని దృష్టిలో పుట్టుకుని కీలక నిర్ణయం తీసుకుంది టీటీడీ.. టికెట్లు లోకపోయినా సర్వదర్శనం కల్పిస్తామని అధికారులు తెలిపారు.. నేరుగా కొండపైకి చేరుకోవాలని సూచించారు. అయితే, ఇప్పటికే టికెట్లు తీసుకున్నవారి పరిస్థితి ఏంటి? అనేది తెలియాల్సి ఉన్నా.. మరోవైపు.. భక్తుల రద్దీని దృష్టిలోపెట్టుకున్న టీటీడీ.. వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసింది.. రేపటి నుంచి ఆదివారం వరకు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది టీటీడీ. తిరుపతిలో 3 ప్రాంతాల్లో సర్వదర్శన టోకెన్లను టీటీడీ జారీ చేసింది. గోవిందరాజస్వామి సత్రాలు, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్ దగ్గర టోకెన్లను జారీ చేశారు.

# అమాత్య పదవి అందుకుని పెద్దిరెడ్డి కాళ్లు మొక్కిన రోజా

**పొలిటికల్ సర్కిల్స్ లో హాట్ టాపిక్**

అమరావతి ఏప్రిల్ 12 అమాత్య పదవి అందుకుని పెద్దిరెడ్డి కాళ్లు మొక్కారు. ఇదే ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్ లో చర్చనీయాంశం అవుతోంది. హాట్ టాపిక్ గా మారింది.ఎప్పటి నుంచో ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాల్లో రెండు వర్గాలు కొట్టుకుంటున్నాయి. అవి నానాటికీ తమ స్వరాన్ని పెంచుకుంటూ పోతున్నాయి. అవే రోజా వర్గం మరియు పెద్ది రెడ్డి వర్గం. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో కూడా రోజా వర్గం మాట నెగ్గకుండాపోయింది. నగరి మున్సిపాల్టీ కి సంబంధించి కూడా పెద్దిరెడ్డి మాటే నెగ్గింది.వాస్తవానికి రోజారెడ్డికి పెద్దిరెడ్డికి ఎప్పటి నుంచో వైరం ఉంది అయినా కానీ జగన్ ఓ విధంగా వీటిని చూసీ చూడని విధంగానే వదిలేశారు. ఇంకా చెప్పాలంటే టామ్ అండ్ జెర్రీ వార్ లానే చూశారు.కొన్ని సార్లు రోజా కంటతడి పెట్టుకున్నారు కూడా! ముఖ్యమంత్రి జగన్ ను కలిసి తన బాధను వెళ్లగక్కారు కూడా! అయినా పెద్దాయనను నిలువరించడం అటు జగన్ వల్ల కానీ ఇటు సజ్జల వల్ల కానీ జరగని లేదా కుదరని పని అని తేలిపోయింది.నియోజకవర్గంలో బాహాటంగానే రోజాను నిలువరించి అవమానించిన ఘటనలు బోలెడు ఉన్నాయి. కొన్ని సార్లు స్థానికులతో (అక్కడి వారు తమిళులు) తిట్టించిన దాఖలాలు ఉన్నాయి. ఆ రోజు పోల్ సీన్ లో కూడా నేరుగా వాగ్వాదానికి దిగినా కూడా పెద్ది రెడ్డి మనుషులు రోజా రెడ్డిని ఖాతరు చేయలేదు. ఏదేమయినప్పటికీ టీడీపీ నుంచి అనూహ్యంగా బయటకు వచ్చి వైసీపీ తీర్థం అందుకుని రెండు సార్లు ఎమ్మెల్యే అయిన రోజా ఇవాళ అంతే స్థాయిలో తన పరువు పోయిన చోటే దక్కించుకునేందుకు చేసిన ప్రతి ప్రయత్నం మొదట్లో విఫలం అయిన విధంగా కనిపించినా ఆఖరికి ఫలితం మాత్రం సఫలీకృత ధోరణిలోనే ఉంది.ఇంకొన్ని సార్లు వైరి వర్గం అయిన టీడీపీ నాయకులను ప్రోత్సహించి వారితో కూడా పెద్దిరెడ్డి తిట్టించారు అన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయినా కూడా రోజా వీటినన్నింటినీ ఎదుర్కొన్నారు. ఆర్థిక కారణాల రీత్యానే తాను టెలివిజన్ షో లు చేస్తున్నానని కూడా ఓ సందర్భంలో చెప్పారు. వాటిని కూడా సాకుగా చూపి టీడీపీ నాయకులతో కొన్ని కామెంట్లు చేయించారని అంతేకాకుండా దాన్నొక సాకుగా చూపించి పెద్దిరెడ్డి తనను తిట్టించారని అప్పట్లో రోజా తన వారి వద్ద వ్యాఖ్యానించారని వార్తలు వచ్చాయి! ఏదేమయినప్పటికీ అవన్నీ మరిచిపోయి నిన్నటి వేళ పెద్దాయన కాళ్లు మొక్కారు.నగరి నియోజకవర్గంలో రోజాను అడుగు పెట్టనివ్వమన్న నారాయణ స్వామి (పెద్దిరెడ్డి శిష్యుడు) మనుషులు కూడా ఇప్పుడు శాంతించే ఉంటారు. దీంతో ఇన్నాళ్ల వాగ్యుద్ధానికి అంతః కలహానికి నిన్నటితో తెర పడిందా? లేదా ముందున్న కాలంలో ఇంకొన్ని సవాళ్లను రోజా స్వీకరించాల్సి ఉందా?అన్నది వేచి చూడాల్సి ఉంది.

# శ్రీ లంక కు ప్రపంచ బ్యాంకు సాయం

కొలంబో ఏప్రిల్ 12, (న్యూస్ పల్స్) తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న శ్రీలంకకు ప్రపంచ బ్యాంక్ అండగా నిలిచింది. ఇతర దేశాల నుంచి ఔషధాలను కూడా దిగుమతి చేసుకోలేని స్థితిలో ఉన్న దేశానికి, అత్యవసర ఔషధాలను కొనుగోలు చేసేందుకు తక్షణమే 10 మిలియన్ అమెరికా డాలర్లను విడుదల చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని శ్రీలంక ఆర్థిక మంత్రి అలీ సబ్రీ తెలిపారు. ప్రపంచ బ్యాంకు అధికారులతో జరిగిన చర్చల అనంతరం ఆమోదం లభించిందని సోమవారం రాత్రి జరిగిన టెలివిజన్ కార్యక్రమంలో ఈ విషయాన్ని చెప్పుకొచ్చారు.ఎమర్జెన్సీ మందులు, గ్యాస్‌తో సహా ఇతర నిత్యావసరాలను కొనుగోలు చేసేందుకు ప్రపంచ బ్యాంకు మరో 500 మిలియన్ డాలర్లను రెండు వారాల్లోగా మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు. ఇదిలా ఉంటే తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న శ్రీలంకలో? అధ్యక్షుడు గొటబాయ రాజపక్స రాజీనామా కోసం ఒత్తిడి పెరుగుతోన్న విషయం తెలిసిందే. అధ్యక్షుడి సెక్రటేరియట్ వద్ద నిరసనలు నిన్న కూడా కొనసాగాయి. నిరసనకారులు రాత్రంతా అక్కడే ఉండి 'గో హోమ్ గొట' అంటూ అధ్యక్షుడి రాజీనామా కోసం నినాదాలు చేశారు. తమకు కరెంట్, గ్యాస్, పెట్రోల్, మెడిసిన్ లేవు? అందుకే ఆందోళన చేస్తున్నామని ప్రజలు తెలిపారు. రాజపక్సే రాజీనామా చేయాల్సిందేనని నిరసనకారులు నినాదాలు చేస్తున్నారు.ఇదిలా ఉంటే శ్రీలంకలో నిరసన ప్రదర్శనల్లో విషాదం జరిగింది. శ్రీలంక హిప్/హాప్ రాప్ కళాకారుడు షిరాజ్ రుడెబ్వోయ్ నిరసనలో గుండె పోటుతో మృతి చెందారు. ఓల్డ్ పార్లమెంట్ ఎదుట జరిగిన నిరసనల్లో ఈ విషాదం చోటుచేసుకుంది. నిరసనకారులని ఉత్సాహపర్చేందుకు ర్యాప్ సాంగ్స్ పాడుతుండగా షిరాజ్ అక్కడికక్కే కూలిపోయారు. షిరాజ్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇక షిరాజ్ నిరసనకారులను ఉత్సాహపరుస్తూ పాటలు పడుతుండగా చిత్రీకరించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.

# బూస్టర్ డోస్ ను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలి

**-ప్రజారోగ్య వేదిక డిమాండ్**

నెల్లూరు కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 10 నుంచి 18 ఏళ్ళు పై బడిన వారికి ప్రైవేటు సెంటర్ల ద్వారా ప్రజలే కొనుక్కుని బూస్టర్ డోస్ ను వేయించుకోవాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని ప్రజారోగ్య వేదిక కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.కరోనా వ్యాధి ఈ దేశంలో ఎండమిక్ గా ఉంది. ఈ మహమ్మారితో ఇంకా చాలాకాలం ప్రజలందరూ సహ జీవనం చేయవలసిన అవసరం ఉంది, కాబట్టి ఈ వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలో ప్రభుత్వం గానీ ప్రజల గానీ ఏమాత్రం అలసత్వం చేయవద్దని కోరారు.మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం లాంటి కరోనా నివారణ చర్యలను ప్రజలు తప్పక పాటించాలని సూచించారు. కరోనా నివారణను మరియు వ్యాధి తీవ్రతను తగ్గించడంలో అమోఘమైన పాత్ర పోషిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని ప్రజలందరికీ ఉచితంగా అందించాలని ప్రజారోగ్య వేదిక ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది. కరోనాకు ఇప్పటివరకు సరైనటువంటి మందు కనుగొనబడలేదని తెలుస్తుందన్నారు.అత్యవసరంగా ప్రారంభించినప్పటికీ ఈ వ్యాక్సిన్లు కరోనాను చాలావరకు నివారిస్తున్నాయని, కరోనా వచ్చినా వ్యాధి తీవ్రతను తగ్గిస్తున్నాయని, వ్యాధిగ్రస్తుడు ఆస్పత్రి పాలు కాకుండా ఈ వ్యాక్సిన్లు పనిచేస్తున్నాయని దాదాపుగా నిర్ధారణ అయ్యిందన్నారు. అందువలన అత్యధిక శాతం ప్రజలు వ్యాక్సిన్ ని వేయించుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వ్యాక్సిన్ ను ఉచితంగా అందించడమే దీనికి ప్రధాన కారణం అని తెలియజేశారు. అత్యధిక శాతం ప్రజలు వయసుతో నిమిత్తం లేకుండా టీకాలు వేయించుకున్నారన్నారు. వ్యాక్సిన్ ను ప్రజలే కొనుక్కొని ప్రైవేటు కేంద్రాల్లో బూస్టర్ డోస్ వేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సరైంది కాదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన బూస్టర్ డోస్ ధర రూ.225 మరియు వ్యాక్సిన్ వేసినందుకు వ్యాక్సినేషన్ సెంటర్ కు కట్టవలసిన ఛార్జ్ 150 రూపాయలు వెరసి 375 రూపాయలు చెల్లించి, కరోనా వ్యాక్సిన్ కొనుక్కొని ప్రజలు వేయించుకోలేర అని ప్రభుత్వానికి తెలియజేశారు. ప్రజలందరికీ ప్రభుత్వం ఉచితంగా కరోనా టీకాని ఇవ్వాలని,కరోనా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నేషనల్ హెల్త్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా చేయాలని ప్రజారోగ్య వేదిక ప్రతినిధులు డాక్టర్ ఎన్.వి. రమణయ్య, పి కామేశ్వరరావులు ప్రభుత్వాన్ని కోరారు.

# వాలంటీర్ల వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

**కోవూరు శాసనసభ్యులు ప్రసన్న కుమార్ రెడ్డి**

విడవలూరు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం విడవలూరు మండలం రామచంద్రాపురం పంచాయితీలో వాలంటీర్ల మరియు వైస్సార్సీపీ కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారుఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొన్నారుఈ కార్యక్రమంలో భాగంగా రామతీర్థం, రామచంద్రపురం పంచాయతీకి చెందిన వాలంటీర్లను వాళ్ళ వాళ్ల కస్టర్లో ప్రభుత్వ పథకాలుఎంతమందికిఅందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు తదనంతరం గ్రామంలోని వాలంటీర్ల కు శాలువాతో సత్కరించి వారికి సేవామిత్ర,సేవారత్న సేవావజ్ర.వచ్చిన వాలంటీర్లకు పురస్కారం అందజేశారు అనంతరం ఓ టి ఎస్ పత్రాలను అందజేశారు.ఈ సమావేశంలో వాలంటీర్లు ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలు వలన ప్రజలు ఎటువంటి లబ్ధి పొందినారు వాటి గురించి వివరించారు.అనంతరం ఈ సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వాలంటీర్ల వ్యవస్థ వల్ల రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుందని దేశంలోని పలు రాష్ట్రాలు వాళ్ల రాష్ట్రంలోకూడా వాలెంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టాలని మొగ్గసూపుతున్నారన్నారు.గ్రామ వాలెంటీర్స్ ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరుస్తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలనికోరారు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని అటువంటి అభివృద్ధి పదాన్ని పట్టుకొని ప్రతిపక్షాలు ఏమీ అభివృద్ధి చేయడం లేదని అనటం హాస్యాస్పదమని ఇటువంటి అబద్ధపు మాటలను ప్రతిపక్షాలు మానుకోవాలని ప్రసన్నకుమార్రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఆప్కాబ్ చైర్మన్ అనిల్ బాబు.జడ్పీటీసీ పెంచలయ్య.ఎంపీపీ భవానమ్మ సర్పంచులు సుజనా.శ్రీనివాసులు.

## పందెం రాయుళ్లు అరెస్టు

చింతలపూడి ఏలూరు జిల్లా చింతలపూడి మండలం నాగిరెడ్డి గూడెం గ్రామంలో కోడిపందాలు ఆడుతున్న వారిని అరెస్ట్ చేసిన చింతలపూడి ఎస్ఐ పి.చెన్నరావు కి రాబడిన సమాచారం మేరకు నాగిరెడ్డి గూడెం గ్రామంలో కోడిపందాలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి 32500 రూపాయలు రెండు కోళ్లు రెండు కోడి కత్తులను మరియు మోటార్సైకిళ్లను స్వాధీనపరుచుకున్నారు. కోడిపందాలు ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినారు.

## మాజీ మంత్రులు ఏం చేశారో?

**కొత్త మంత్రులు ఏం చేస్తారో**

విశాఖపట్నం ఏపీలో కొలువుదీరిన కొత్త క్యాబినెట్ పై పిసిసి అధ్యక్షుడు శైలజా నాథ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. మాజీ మంత్రు లు ఏం చేశారో, కొత్త మంత్రులు ఏమి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. జగన్ పై స్వామి భక్తి చూపిం చే వారికి బెర్త్ కన్ఫర్మ్ చేసారని ఎద్దేవా చేశారు.కొత్తమంత్రులైన ప్రజాపాలనపై దృష్టి సారించాలని లేకుంటే కాలగర్భం లో కలిసిపోతారని శైలజానాథ్ అన్నా రు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధా నాలపై ప్రజలను చైతన్య పరిచి భవి ష్యత్తులో అధికారంలోకి కాంగ్రెస్ వచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.

## సిక్కోలు రైలు ప్రమాదంలో 5కు చేరిన మృతులు

శ్రీకాకుళం, ఏప్రిల్ 12, (న్యూస్ పల్స్)శ్రీకాకుళం జిల్లాలో సంభవించిన రైలు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు.. జి. సిగడాం మండలం బాతువ ? చీపురుపల్లి రైల్వే స్టేషన్ మధ్య ఈ దుర్ఘటన జరిగింది.. గౌహతి వైపు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు సాంకేతిక లోపం వల్ల అక్కడ నిలిచిపోయింది. కొందరు ప్రయాణికులు రైలు దిగి ప్రక్కన పట్టాలపై నిలబడి ఉండగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వారిపై నుంచి దూసుకెళ్లింది.. దీంతో.. రైలు పట్టాలపై నిలిచినున్నవారు మృతిచెందారు.. పలువరు గాయాలపాలయ్యారు.. ఘటనా స్థలంలో చెల్లా చెదురుగా మృతదేహాలు పడిపోయాయి.. రైలు ఢీ కొట్టడంతో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులలో ముగ్గురు వ్యక్తులు అస్సాం రాష్ట్రానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. జి.సిగడాం మండలం భాతువ వద్ద సాంకేతిక కారణంతో గౌహతి ఎక్స్ ప్రెస్ కొద్ది సేపు నిలిచిపోయింది.. దీంతో.. కొందరు ప్రయాణికులు ట్రైన్ దిగి పక్క ట్రాక్‌పై రావడంతో అనుకొని ప్రమాదం చోటు చేసుకుంది.. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రూపంలో మృత్యు శకటం వీరిపై దూసుకెళ్లింది.. ఈ ఘటనలో మృతి చెందిన ఐదుగురిలో ముగ్గురు అస్సాంకు చెందిన పసుమంత్రి వజులు, బనిషర్ బసుమంత్రి , రసిదుల్ ఇస్లాంగా గుర్తించారు. ట్రైన్ ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి జిట్టునాయక్ ఒడిశా రాష్ట్రం బరంపురంగా తెలుస్తుంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం విజయనగరం ఎంఆర్ ఆసుపత్రికి తరలించారు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. వివిధ కోణాల్లో ధర్మాప్తు చేస్తున్నారు. రైలులో పొగలు రావడంతో చైన్ లాగి దిగటానికి ప్రయత్నించారా? లేదా సాంకేతిక కారణాలతోనే గౌహతి ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయిందా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది.. శ్రీకాకుళం జిల్లాలో రైలు ఢీకొని పలువురు మరణించిన ఘటనపై సీఎం వైఎస్ జగన్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు.. క్షతగాత్రులకు మంచి వైద్యసేవలు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. ఘటనకు సంబంధించిన ప్రాథమిక వివరాలను సీఎంకు వివరించారు అధికారులు.. విశాఖపట్నం నుంచి గౌహతి వెళ్తున్న రైలు సాంకేతిక లోపంతో నిలిచిపోయిందని.. చల్లగాలికోసం కొంతమంది ప్రయాణికులు కిందకు దిగారని, మరో ట్రాక్‌పై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వీరిని ఢీ కొట్టడంతో కొంత మంది మరణించినట్టుగా సీఎంకు వివరించారు.. మరణించిన వారి కుటుంబాలకు అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందించాలని స్పష్టం చేశారు సీఎం వైఎస్ జగన్.

## 24 గంటలవిద్యుత్ అందించడమే లక్ష్యం

విజయవాడ ఏప్రిల్ 12, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సీఎం వైఎస్ జగన్ కేబినెట్‌లో మంత్రి పదవి మరోసారి వరించింది.. విద్యుత్, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, గనులశాఖలను పెద్దిరెడ్డికి అప్పగించారు జగన్.. ఇవాళ సచివాలయంలోని మూడో బ్లాక్‌లో బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.. సీఎం జగన్ కేటాయించిన మూడు శాఖల్లో మంచి పేరు తెచ్చేందుకు కృషి చేస్తా.. రైతులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత విద్యుత్‌ని సమర్థవంతంగా అమలు చేస్తామని? పరిశ్రమలకు పవర్ హాలిడే లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటాం.. పరిశ్రమలకు పవర్ హాలిడే లేకుండా చేయాలన్నదే లక్ష్యంగా వెల్లడించారు.ఇక, గనుల శాఖలో చేపట్టిన సంస్కరణల వలన ఆదాయం పెరిగిందన్నారు మంత్రి పెద్దిరెడ్డి? ఆ ఆదాయం మరింత పెంచేందుకు కృషి చేస్తానని.. సీఎం వైఎస్ జగన్ అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించడం ద్వారా అటు ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువస్తామని, అలాగే ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందిస్తామని వెల్లడించారు. మరోవైపు, కేబినెట్ కూర్పు వల్ల పార్టీలో ఎటువంటి అసంతృప్తులు లేవని స్పష్టం చేశారు పెద్దిరెడ్డి.. వైఎస్ జగన్ నాయకత్వంలో అందరికీ గుర్తింపు ఉందని, ప్రతి ఒక్కరికీ సరైన గౌరవం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## పూలే ఆశయాలకు అనుగుణంగా పని

విజయవాడ ఏప్రిల్ 12, (న్యూస్ పల్స్) మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో కొనసాగించిన సీఎం జగన్ కు ధన్యవాదాలు తెలిపారు ఐ అండ్ పీఆర్ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ. మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయాలకు క్యాబినెట్ అద్దంపట్టేలా ఉందన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించారని కొనియాడారు.బీసీలలో పేదరికాన్ని తరిమేందుకు, విద్యను గ్రామస్థాయిలో అందేలా సీఎం పథకాలు అమలుచేశారు. స్వాతంత్ర్యం తర్వాత బీసీలకోసం ఇంతలా ఆలోచించిన నాయకులు లేరు. ప్రభుత్వంపై బురదచల్లేలా ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. సినీ పరిశ్రమ ఇబ్బందులు తొలగాలనేది సీఎం లక్ష్యం. ఆ దిశగా అడుగులు వేస్తాం. రాష్ట్రంలో ఉన్న ప్రకృతి అందాలను, షూటింగ్ స్పాట్లను సినిమా పరిశ్రమ ఉపయోగించుకోవాలన్నారు మంత్రి వేణుగోపాల్. సమాచారశాఖ ద్వారా వాస్తవాలు ప్రజలకు అందిస్తాం అన్నారు. జగన్ కేబినెట్లో గతంలోనూ వేణుగోపాల్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తిరిగి జగన్ వేణుగోపాల్ కి అవకాశం కల్పించారు.

# మంత్రి పదవి కన్నా నా ప్రాంత అభివృద్ధే ముఖ్యం

## వలంటీర్ల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి .వై. సీతారామిరెడ్డి





. మంత్రాలయం ( విభారె) :ఏడాదిన్నర కాలం ఉండే మంత్రి పదవి కన్నా వెనుకబడిన నా నియోజకవర్గ అభివృద్ధే నా ముఖ్యం అని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని దుర్గా రమణ కళ్యాణ మండపంలో నిర్వహించిన వలంటీర్ల వందనం కార్యక్రమానికి పెద్దాయన ఎమ్మిగనూర్ ఆర్టీసి డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై. సీతారామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా పెద్దాయన ను, ఎమ్మెల్యే ను సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో గజమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు మంత్రి వర్గ విస్తరణ లో అవకాశం వస్తుందని భావించి అవకాశం రాకపోవడంతో తనకు చాలా మంది అభిమానులు, నాయకులు ఆవేదన పడ్డారన్నారు. మంత్రి వర్గ విస్తరణ కు ముందు మా సోదరుడు ఆదోని ఎమ్మెల్యే వై. సాయిప్రసాద్ రెడ్డి అన్న గారి తో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి గారిని కలిసిన సమయంలో తమ కుటుంబంలో మంత్రి పదవి ఎవరికి ఇవ్వాలో మీరే నిర్ణయించుకోండి అని ముఖ్యమంత్రి గారు అంటే తమకు ఏడాదిన్నర ఉండే మంత్రి పదవి కన్నా వెనుకబడిన మా నియోజకవర్గాల అభివృద్ధే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వివరించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీనికి ప్రతిపక్ష టీడీపీ పార్టీ మంత్రి ఇవ్వలేదని ప్రచారం చేస్తున్నారు. ఎవ్వరికైనా దమ్ము ధైర్యం ఉంటే రండి ముఖ్యమంత్రి గారి దగ్గరికి తీసుకుని వెళ్లి పదవి ఇస్తామన్నారా లేదా అని నిరూపిస్తామని సవాల్ చేశారు. ముఖ్యంగా నియోజకవర్గంలో రైతులకు, ప్రజలకు అవసరమైన సాగు, తాగు నీరు గురించి అడిగిన వారం రోజులోపే 5 లిఫ్ట్ ఇరిగేషన్ లు మంజూరు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. దీనికి తోడు దాదాపు రూ 6 కోట్ల రూపాయలతో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు రూ 3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడం జరిగిందన్నారు. వి. తిమ్మాపురం గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి గ్రామంలో నీటి కొరత ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని రావడంతో తన నిధులతో తాగునీటి పైప్ లైన్ వేయిస్తామని హామి ఇచ్చారు. అంతే కాకుండా తన నియోజకవర్గ అభివృద్ధి కి దాదాపు రెండు కోట్ల రూపాయల నిధులు త్వరలోనే వస్తాయని రాగానే ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో ఉంచుతానన్నారు. ముఖ్యంగా వలంటీర్ల ఎక్కడ కూడా నిర్లక్ష్యం వహించకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. త్వరలోనే గ్రామాల పర్యటన కు వస్తానని అంతలోపు పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఓటిఎస్, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ కోసం సర్పంచ్లు, ఎంపీటీసీ లను భాగ్యస్వాములను చేసుకుని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. అనంతరం వలంటీర్ల సేవలను గుర్తించి ప్రోత్సాహకాలకు ఎంపికైన వారికి సేవరత్న, సేవ మిత్ర అవార్డులను అందజేసి శాలువ కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ జి. భీమిరెడ్డి, ఇన్ చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, తహసీల్దార్ దేవ చంద్ర శేఖర్,ఎస్ఐ లు వేణుగోపాల్ రాజు, హుస్సేన్ పీరా, ఈవోపీఆర్డి నాగేష్, ఏపియం జయశ్రీ వీరితో పాటు శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ సుజాత శంకర్ మరియు మండల స్థాయి అధికారులు, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, రాంపురం రెడ్డి సోదరుల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 245 గ్రాముల వెండి విరాళం

కౌతాళం ( విభారె) శ్రీ నరసింహ స్వామి దేవస్థానమునకు ఆదోని గ్రామ వస్తువులైన టీ నాగరాజ్ 245 గ్రాముల వెండి ఆలయ అధికారులకు విరాళంగా అందించారు. దాతలకు దేవస్థానం ఆలయ అధికారులు శ్రీ స్వామివారి దర్శనం మరియు ఆశీర్వాదాలు కల్పించి స్వామివారి శేష వస్త్రాలు లడ్డూ ప్రసాదాలు అందించి పూలమాలలతో సత్కరించారు ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని భక్తులు విరాళాలు అందించి సహకరించగలరని ఆలయ అధికారులు విన్నవించారు



# అక్రమంగా ఇసుక రవాణా

## జెసిబి మరియు టిప్పర్ లతో ఇసుక దందా అడ్డుకున్న బొందిమడుగుల గ్రామ ప్రజలు



తుగ్గలి:( విభారె) కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండలంలోని బొందిమడుగుల గ్రామంలో అక్రమంగా ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకుండా రెవెన్యూ అధికారులు అక్రమంగా కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి ఇష్టారీతిన బొందిమడుగుల గ్రామంలో రెండు జెసిబి లు పెట్టుకొని 8 టాస్కర్ లతో అక్రమంగా ఇసుక తరలిస్తు లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని గ్రామ ప్రజలు తెలియజేశారు.గ్రామంలో ప్రజలకు ఇసుక అవసరం రీత్యా ఉపయోగపడుతుందని ప్రజలు అనుకుంటే అక్రమార్కులు తుగ్గలి మండల అధికారులను కుమ్మక్కు చేసుకొని ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకుండా అనధికారికంగా ఓరల్ ఆర్డర్ మండలములో ఎక్కడైనా ఇసుక తీసుకోండి అని పాస్ చేసి బొందిమడుగుల ఈదుల వంకలో నాలుగు రోజులుగా 8 టాస్కర్ లు రెండు జెసిబి లు పెట్టి ఇసుకను అక్రమంగా తరలిస్తూ లక్షలు సొమ్ము చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రజలు తెలియజేశారు.ఈ ఇసుక దందా అంతా తుగ్గలి రెవెన్యూ సంబంధిత మండల అధికారులందరికి తెలిసే జరుగుతుందని,ఈ అక్రమాలను ఈరోజు బొందిమడుగుల గ్రామ ప్రజలు తిరగబడి అక్రమంగా తరలిస్తున్న 8 టాస్కర్ బండ్లను రెండు జెసిబి లను ఆపి గౌరవ కర్నూలు జిల్లా ఎస్.పి గారికి కలెక్టర్ కు,ఆర్ డి.ఓ కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలపడమైనది.వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుగ్గలి ఎస్సై సమీర్ భాష, డిప్యూటీ తాసిల్దారు నిజాముద్దీన్ బొందిమడుగుల గ్రామానికి చేరుకొని అక్రమంగా తరలిస్తున్న 8 మిది ఇసుక టాస్కర్ లను పోలీస్ స్టేషన్ కు తీసుకొనిపోయి సీజ్ చేసారు. అక్రమంగా ఇసుక రవాణా జరిపిన వారిపై అనధికారికంగా పర్మిషన్ మంజూరు చేసిన సంబంధిత అధికారులపై ఉన్నత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకొని బొందిమడుగుల గ్రామంలో అక్రమంగా ఇసుక తరలింపు చేపట్టిన వారిపై చర్యలు తీసుకొని బొందిమడుగుల గ్రామానికి ప్రజలకు ఇసుక ఉపయోగపడే విధంగా చూడాలని కర్నూలు జిల్లా కలెక్టర్ కు వారు తెలియజేశారు. అక్రమంగా ఇసుక తరలింపులో కాంట్రాక్టర్లకు క్వాంటిటీ లేకుండా అనధికారంగా రూరల్ ఆర్డర్ పాస్ చేసి వరంగల్ లో ఇసుక అక్రమ రవాణా కు సహకరించిన తుగ్గలి తహాసిల్దార్ కర్నూలు జిల్లా కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఆర్పిఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టిఎం రమేష్ మాదిగ,విద్యా కమిటీ వైస్ చైర్మన్ పులిరాజు,కాంగ్రెస్ పార్టీ మహబూబ్ బాషా, తెలుగుదేశం పార్టీ బొందిమడుగుల గ్రామ యువజన అధ్యక్షుడు మజీద్,మా భాష,హరి, మల్లికార్జున,తెలుగు మహేష్,హుస్సేన్ భాష, రాజు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఉచితంగా ఇచ్చేది రూపాయి ప్రజల నుంచి తీసుకునేది 3 రూపాయలు ఇదెక్కడి న్యాయం

### కె ప్రసాద్ సిపిఐ పట్టణ కార్యదర్శి

నంద్యాల :- నంద్యాల పట్టణంలో మంగళవారం నాడు సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా ఇచ్చేది రూపాయి. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసేది మూడు రూపాయలు ఇదెక్కడి న్యాయం చెప్పండి సీయం . జగన్ మోహన్ రెడ్డి గారు అని అన్నారు. పెట్రోల్. డీజిల్. గ్యాస్. వంటనూనెల ధరలు. విద్యుత్ ఛార్జీలు. ఆస్తి. నీటి. పన్నుల పెంపు ను వ్యతిరేకిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రెండవ రోజు నంద్యాల పట్టణంలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ప్రచార అందోళనలు నిర్వహించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భూమని శ్రీనివాసులు డి శ్రీనివాసులు నాయకులు అనంతయ్య. కృష్ణ తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చేది వీసమంతా దోసేది కొండంతలా .ప్రజా సంక్షేమ పథకాల అమలును సాకుగా చూపి అన్ని వర్గాల ప్రజలపై పన్నుల భారాలను అత్యధికంగా మోపుతుందని అన్నారు. అనవసరమైన లింకులు పెట్టి అర్హులైన లబ్ధిదారులను తొలగిస్తుంది రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను. నీటి పన్ను. చెత్త పన్నులను పెంచుతూ జీవో నెంబర్ 196. 197. 198 లను తీసుకొచ్చి ప్రజల నడ్డి విరుస్తుంది వెంటనే పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించి జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని వంటనూనెలు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని విద్యుత్ ఛార్జీలు. ఆస్తి. నీటి. చెత్త పన్నుల భారాలను విరమించుకోవాలని కోరారు. బుధవారం నాడు సిపిఐ ఆధ్వర్యంలో సచివాలయ దగ్గర జరిగే ధర్నా లను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీను శ్రీరామ్ వెంకటేష్ శంకర్ శివ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# 'ఆచార్య' హడావిడి.. ఆ పేర్లతో అంచనాలు పీక్స్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా రామ్ చరణ్ కీలక పాత్రలో తెరకెక్కిన ఆచార్య సినిమా విడుదలకు సిద్దంగా ఉంది. ఈ నెల 29వ తారీకున ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఆచార్య సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను మరో వారం రోజుల్లో మొదలు పెట్టబోతున్నారు. చిరంజీవి తో పాటు రామ్ చరణ్ ఇంకా దర్శకుడు కొరటాల శివ ఇతర యూనిట్ సభ్యులు ప్రమోషన్ కార్యక్రమాల్లో సందడి చేయబోతున్నారు.ఇక ఆచార్య సినిమా ప్రీ రిలీజ్ వేడుక గురించి ఇప్పుడు ప్రధానంగా చర్చ జరుగుతోంది. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు యూసుఫ్ గూడ పోలీస్ లైన్స్ ను వెన్యూగా ఖరారు చేయడం జరిగింది. ఇక పోలీసుల మరియు ప్రభుత్వం అనుమతితో ఈనెల 24న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించాలని తేదీని కూడా నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.చిరంజీవి ముఖ్య అతిథిగా ఎన్నో సినిమాల వేడుకలు జరుగుతుంటాయి. ఆయన ముఖ్య అతిథి అంటే ఆ సినిమా స్థాయి అమాంతం పెరిగినట్లే. అలాంటిది ఆయన సినిమా కు ముఖ్య అతిథులుగా ఎవరు రాబోతున్నారు అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఎవరు వచ్చినా ఆయన కంటే తక్కువే.. అయినా కూడా సినిమాకు సంబంధించిన వారు కాకుండా బయటి వారు ఎవరు వస్తారు అనేది చర్చనీయాంశంగా మారింది.గత రెండు మూడు రోజులుగా మెగా కాంపౌండ్ నుండి వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఆచార్య సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కు గాను పవన్ కళ్యాణ్ మరియు రాజమౌళి లు హాజరు కాబోతున్నట్లుగా తెలుస్తోంది. వీరిద్దరి ప్రజెన్స్ తో ఆచార్య సినిమా స్థాయి అమాంతం పెరుగుతుంది అంటూ కొందరు అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చరణ్ ఈ సినిమా లో నటించాడు కనుక ఎలాగూ ఆయన వస్తాడు.ఇంకా ఈ ప్రీ రిలీజ్ వేడుక లో రామ్ చరణ్ తల్లి సురేఖ మరియు చిరంజీవి తల్లి అంజనా దేవి గారు కూడా వస్తారని తెలుస్తోంది. మెగా ఫ్యామిలీ కి చెందిన నాగబాబు ఇంకా కొందరు కూడా ఈ కార్యక్రమంలో సందడి చేస్తారని అంటున్నారు. చాలా కాలం తర్వాత జరుగుతున్న ఈ మెగా వేడుక ఖచ్చితంగా మెగా ఫ్యాన్స్ కు కన్నుల విందుగా ఉంటుందని ప్రతి ఒక్కరు నమ్మకంతో ఉన్నారు.చిరంజీవి మరియు రామ్ చరణ్ గతంలో ఒకటి రెండు సినిమాల్లో కలిసి కనిపించారు. కాని ఒక పూర్తి స్థాయి కథలో భాగం అయిన పాత్రల్లో వీరిద్దరు కలిసి నటించలేదు. మొదటి సారి వీరిద్దరు నటించిన కారణంగా... ఇప్పటి వరకు అపజయం అనేది ఎరుగని కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన కారణంగా ఆచార్య పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్న ఈ సమయంలో ప్రీ రిలీజ్ బిజినెస్ భారీగా చేస్తే సినిమా భారీ ఓపెనింగ్స్ ను దక్కించుకుంటుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




# పూరి కల అలా మిగిలి పోకూడదు.. చిరు మంచి మనసు

మెగా స్టార్ చిరంజీవి ప్రస్తుతం నటిస్తున్న గాడ్ ఫాదర్ సినిమాపై అంచనాలు అంతకంతకు పెరుగుతున్నాయి. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ నటిస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. వాటిని కేవలం పుకార్లు అనుకున్నారు. కాని గాడ్ ఫాదర్ టీమ్ ముంబయి వెళ్లి అక్కడ సల్మాన్ ఖాన్ తో షూటింగ్ చేసుకుని వచ్చారు. షూటింగ్ ముగింపు దశకు వచ్చిన సమయంలో పూరి జగన్నాద్ కూడా గాడ్ ఫాదర్ తో కలిశాడు.గత కొన్ని రోజులుగా పూరి జగన్నాద్ కు ఒక చిన్న పాత్రను గాడ్ ఫాదర్ మేకర్స్ ఇచ్చారంటూ వార్తలు వచ్చాయి. ఇవి ఖచ్చితంగా పుకార్లే అని అంతా భావించారు. ఇలాంటి సమయంలో అనూహ్యంగా గాడ్ ఫాదర్ తో డాసింగ్ డైరెక్టర్ పూరి జగన్నాద్ కలిశాడు. నేటి నుండి షూటింగ్ లో కూడా పాల్గొంటున్నాడు. చిరంజీవి తో సినిమా చేయాలన్న ఆయన కల నెరవేరిందంటూ పూరి అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఈ సమయంలో చిరంజీవి ట్విట్టర్ లో ఇంట్రెస్టింగ్ పోస్ట్ ఒకటి పెట్టాడు. ఆయన పూరి గురించి ట్విట్టర్ లో... నర్సీపట్నం నుంచి ఓ కుర్రాడు వచ్చి వెండి తెర పైన నటుడిగా వెలుగు వెలగాలని హైదరాబాద్ వచ్చాడు. ఒకటి అరా వేషాలు వేసాడు. ఇంతలో కాలం చక్రం తిప్పింది. స్టార్ డైరెక్టర్ అయ్యాడు. కానీ అతని మొదటి కల అలా మిగిలిపోకూడదు కదా.. అందుకే ఇలా గాడ్ ఫాదర్ లో అవకాశం ఇచ్చాం అంటూ చిరంజీవి పేర్కొన్నాడు.పూరి జగన్నాద్ కల అలాగే ఉండి పోకూడదు అనే ఉద్దేశ్యంతో చిరంజీవి పిలిచి మరీ అవకాశం ఇవ్వడం ను మెగా అభిమానులు ప్రశంసిస్తున్నారు. చిరంజీవి గొప్ప వాడు.. చిరంజీవి మంచి మనసున్న వ్యక్తి అంటూ ఈతరం ప్రేక్షకులు వినడమే తప్ప చూసి ఉండరు. ఇలాంటివి ఆయన మంచి తనానికి నిదర్శనం అంటూ చిరంజీవి సీనియర్ అభిమానులు గొప్పగా చెబుతున్నారు.చిరంజీవి 150వ సినిమా ను ఆటో జానీగా పూరి జగన్నాద్ తీయాల్సి ఉంది. కాని కొన్ని కారణాల వల్ల క్యాన్సిల్ అయ్యింది. కథ కూడా ఓకే అయ్యింది అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా చిరంజీవి మరో సినిమా ను చేయడంతో పూరి నిరాశ వ్యక్తం చేశాడు. ఆ సమయంలో చిరంజీవి పై పూరికి కోపం వచ్చిందని కూడా పుకార్లు షికార్లు చేశాయి.అప్పుడు కోపం తెప్పించినందుకు ఇప్పుడు పూరికి తన గాడ్ ఫాదర్ సినిమాలో కీలక పాత్రను ఇచ్చి ఆ కోపాన్ని కూల్ చేశాడా అంటూ కొందరు చిరంజీవి గురించి కామెంట్స్ చేస్తున్నారు. చిరంజీవి వంటి స్టార్ కు పూరి కోపాన్ని కూల్ చేయాల్సిన అవసరం లేదు. కాని పూరి గతంలో నటుడు అవ్వాలనే ఆశతో ఉండేవాడు కనుక అతడికి ఈ చిన్న ఆఫర్ ఇస్తే అతడి డ్రీమ్ నెరవేరినట్లు అవుతుందని మెగాస్టార్ భావించి ఉంటాడు అనేది కొందరి అభిప్రాయం.మొత్తానికి గాడ్ ఫాదర్ సినిమాలో పూరి జగన్నాథ్ కనిపించబోతున్నాడు. అది ఏ పాత్ర.. ఎంత సమయం అనేది తెలియాల్సి ఉంది. ఆగస్టులో ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు. మలయాళం సూపర్ హిట్ మూవీ లూసీఫర్ కు ఇది రీమేక్ అనే విషయం తెల్సిందే. నయనతార కీలక పాత్రలో కనిపించబోతుంది.



# హృతిక్ - టైగర్ తో జాన్ ఎటాక్ 2 ప్లాన్?



బాలీవుడ్ సింహబలుడు జాన్ అబ్రహాం నటించిన 'ఎటాక్' బాక్సాఫీస్ వద్ద ఫెయిలైన సంగతి తెలిసిందే. ఆర్.ఆర్.ఆర్ ముందు ఇంకేదీ నిలవదని జాన్ అతడికి అర్థమైంది. ఇకపోతే ఇటీవల జాన్ భాయ్ చేసిన ఓ కామెంట్ నెటిజనుల్లో హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. తాను హిందీ నటుడిని అని సౌత్ లో అస్సలు నటించనని అన్నాడు.మరోవైపు ఎటాక్ ఫ్లాప్ అయ్యిందని అంగీకరిస్తూనే అతడు తదుపరి ఓ హాలీవుడ్ హిట్ మూవీ రీమేక్ గురించి ప్రస్థావించాడు. అలాగే ఎటాక్ 2 తీస్తే అందులో తనతో పాటు వార్ స్టార్లు హృతిక్ - టైగర్ ష్రాఫ్ నటించాలని కోరుకున్నాడు. అలాగే హాలీవుడ్ బంపర్ హిట్ 'ఓషన్స్ 11' రీమేక్ లో నటిస్తానని అతడు అన్నాడు. తాను ఇందులో బ్రాడ్ పిట్ పాత్రలో నటిస్తానని అక్షయ్ కుమార్ తన జార్జ్ క్లూనీ కాగా.. టైగర్ ష్రాఫ్ అతని మాట్ డామన్ గా ఉండాలని కోరుకుంటున్నాడు.తాజా చాటింగులో జాన్ పరిశ్రమలో వోన్ స్పేస్ ని సృష్టించడం గురించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఒకరితో ఒకరు పోటీపడకుండా ఎలా సహకరించుకోవాలి? అనే దాని గురించి మాట్లాడారు. ఇండస్ట్రీలో నటులు ఒకరినొకరు దాచేసుకోవడం సరికాదన్నాడు. దానికి హాలీవుడ్ చిత్రం 'ఓషన్స్ ఎలెవెన్' చిత్రం నుండి ఉదాహరణను ఇచ్చాడు. అతడు తనని తాను బ్రాడ్ పిట్ తో పోల్చుకున్నాడు.లక్ష్య రాజ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఎటాక్ లో జాన్ భాయ్ తో పాటు.. జాక్వెలిన్ ఫెర్నాండెజ్- రకుల్ ప్రీత్ సింగ్ - ప్రకాష్ రాజ్ - రత్న పాఠక్ షా ముఖ్యమైన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం విమర్శకుల నుండి మిశ్రమ సమీక్షలను అందుకుంది. అయితే ఇందులో యాక్షన్ సన్నివేశాలను మెచ్చుకున్నారు. సీక్వెల్ ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది.ఎటాక్ స్టార్ జాన్ అబ్రహం ఇటీవల సిద్ధార్థ్ కన్నన్ యూట్యూబ్ ఛానెల్ చాటింగులో కనిపించాడు. అక్కడ తారలు పరస్పరం సహకరించుకోవాలని కూడా జాన్ అబ్రహాం కోరాడు. అతను సినిమాలలో ఒకరినొకరు కప్పిపుచ్చుకునే నటుల గురించి మాట్లాడాడు. మరోవైపు ప్రతి చిత్రం తర్వాత విమర్శకుల గురించి కూడా అతను గుర్తుచేసుకున్నాడు. వారిలో కొందరు తనను రచయితగా పని చేయమని అడిగారని జాన్ అబ్రహాం పేర్కొన్నాడు.

# అంతా లారా వల్లే జరిగిందన్న పూరన్.. ఆర్సీబీతో మ్యాచ్‌పై హస్సీ ఏమన్నాడంటే..?



ఐపీఎల్ 2022 సీజన్‌లో భాగంగా సోమవారం (ఏప్రిల్ 11) గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, సీజన్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ అన్ని విభాగాల్లో సమిష్టిగా రాణించి గుజరాత్ టైటాన్స్‌ను ఓటమిని పరిచయం చేసింది. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ ద్వారా క్యాష్ రిచ్ లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన గుజరాత్ ఫ్రాంచైజీ.. అరంగేట్రంలోనే హ్యాట్రిక్ విజయాలు సాధించి దూసుకుపోతుండగా, సన్‌రైజర్స్ జీటి విజయాల పరంపరకు అడ్డుకట్ట వేసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బౌలింగ్ చేసిన ఎస్ఆర్‌హెచ్.. భువీ (2/37), నటరాజన్ (2/34), మార్కో జన్సెన్ (1/27), ఉమ్రాన్ మాలిక్ (1/39) రాణించడంతో గుజరాత్ టైటాన్స్‌ను 162 పరుగులకే కట్టడి చేయగలిగింది. ఛేదనలో సన్‌రైజర్స్‌కు ఓపెనర్లు అభినవ్ శర్మ (42), కేన్ విలియమ్సన్ (57) శుభారంభాన్ని అందించగా, ఆఖర్లో పూరన్ (18 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), మార్క్రమ్ (8 బంతుల్లో 12 నాటౌట్; ఫోర్) చెలరేగి ఎస్ఆర్‌హెచ్‌ను విజయతీరాలకు చేర్చారు. ఈ మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడి సన్‌రైజర్స్ విజయంలో కీలకపాత్ర పోషించిన పూరన్, మ్యాచ్ అనంతరం ఆ జట్టు బ్యాటింగ్ కోచ్, దిగ్గజ ఆటగాడు బ్రియాన్ లారాతో మాట్లాడుతూ.. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ ప్రస్థానంపై పలు ఆసక్తికర అంశాలను వెల్లడించాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైన జట్టు తిరిగి గాడిలో పడటానికి బ్యాటింగ్ కోచ్ లారానే ప్రధాన కారణమని పేర్కొన్నాడు. ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన వీడియో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. ఈ వీడియోతో పాటు ఇవాళ (ఏప్రిల్ 12) ఆర్సీబీతో జరుగబోయే మ్యాచ్‌పై సీఎస్‌కే బ్యాటింగ్ కోచ్ మైక్ హస్సీ ఏమన్నాడో (ప్రివ్యూ) చూడొచ్చు. ఇందులో సీఎస్‌కే ఆటగాళ్ల ప్రాక్టీస్, ఇతరత్రా దృశ్యాలు ప్రధానంగా ఆకట్టుకోగా, జట్టు మాజీ సభ్యుడు డుప్లెసిస్‌ను సీఎస్‌కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ఆప్యాయంగా కౌగిలించుకోవడం హైలైట్‌గా నిలిచింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**